షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 219 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 21 జూన్ 2024 పేజీలు 8 : వెల 3/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 219 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE June 21, 2024 PAGES : 8 PRICE : 3/-

## ఢిల్లీ మద్యం కేసులో ఊరట

### కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు

న్యూఢిల్లీ,జూన్20(షణ్ముఖవెలుగు): మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఢిల్లీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో 48 గంటల పాటు బెయిల్ ఆర్డరును నిలిపివేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేసిన విజ్ఞప్తిని న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ కేసులో మార్చి 21న ఈడీ కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. బెయిల్ పిటిషన్‌కు సంబంధించి గురువారం

మిగతా 2లో..



## 6 రాష్ట్రాల్లో ఈవీఎంలపై ఫిర్యాదులు

**8 స్థానాల్లో ఈవీఎంల తనిఖీలు**

**విచారణకు ఆదేశించిన ఎన్నికల సంఘం**

న్యూఢిల్లీ,జూన్20(షణ్ముఖవెలుగు): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా 6 రాష్ట్రాల్లోని 8 స్థానాల్లో ఈవీఎంలు చెడిపోయాయని ఫిర్యాదులు అందడంతో ఎన్నికల సంఘం విచారణకు ఆదేశించింది. హర్యానాలోని కర్నాల్, ఫరీదాబాద్ స్థానాల్లో ఓటింగ్ సందర్భంగా ఈవీఎంలు చెడిపోయాయని ఫిర్యాదులు అందాయి. కాగా తమిళనాడులోని వెల్లూరు, విరుదునగర్ స్థానాల్లో కూడా ఓటింగ్ సందర్భంగా ఫిర్యాదులు వచ్చాయి. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఒక్కో సీటులో ఈవీఎం ట్యాంపరింగ్ జరిగిందనే ఆరోపణలు వచ్చాయి.

మిగతా 2లో..

## నీట్ పేపర్ లీకేజీ బట్టబయలు

**మాకు ముందే అందిందన్న విద్యార్థి**

30లక్షలకు కొనుగోలు చేసినట్లు సమాచారం

పోలీసుల ముందు ఒప్పుకున్న అరెస్టయిన విద్యార్థి

మరోమారు సుప్రీంలో విచారణ..అన్ని కేసులు సుప్రీంకు బదిలీ

కేంద్రం, ఎన్‌టీఏకు నోటీసులు జారీ



న్యూఢిల్లీ,జూన్20(షణ్ముఖవెలుగు): దేశంలో వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన 'నీట్- యూజీ ప్రవేశపరీక్ష 2024 లో అక్రమాలు జరిగినట్లు వస్తోన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. బిహార్‌లో ఈ పరీక్ష ప్రశ్నపత్రం లీకైనట్లు సమాచారం రాగా.. కేంద్రం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ దీన్ని తోసిపుచ్చింది. అయితే, పేపర్ లీక్ నిజమేనని తాజాగా బయటికొచ్చింది. ముందురోజు రాత్రే నీట్ ప్రశ్నపత్రం తమకు అందిందని బిహార్‌లో అరెస్టయిన కొందరు విద్యార్థులు పోలీసుల ఎదుట అంగీకరించారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై దర్యాప్తునకు బిహార్ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటుచేసింది.

మిగతా 2లో..



## ఈ రెండూ రాష్ట్రానికి జీవనాడి

### ఎపి అంటేనే పోలవరం.. అమరావతి

**అమరావతి నిర్మాణం కోసం ఇక ప్రత్యేక శ్రద్ధ**

**రైతుల త్యాగం మరువలేనిదని వెల్లడి**

**అమరావతిలో పర్యటించిన సిఎం చంద్రబాబు**

**అమరావతి శంకుస్థాపన ప్రాంతంలో మోకరిల్లిన బాబు**

**ప్రజావేదిక శిథిలాలను పరిశీలించిన సిఎం**

అమరావతి,జూన్20(షణ్ముఖవెలుగు): ఏపీ అంటే అమరావతి, పోలవరం అని సీఎం చంద్ర బాబునాయుడు అన్నారు. ఈ రెండూ జీవనాడి అని అన్నారు. గురువారం అమరావతి నిర్మాణాల పరిశీలన అనంతరం సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో చంద్రబాబు మాట్లాడారు అమరావతి రైతులు 1631 రోజులు ఆందోళన చేశారు. ఈ సంఖ్య కలిపితే వైకాపాకు వచ్చిన సీట్లకు సరిపోలుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రాజధాని

మిగతా 2లో..



## లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్

పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడి

న్యూఢిల్లీ,జూన్20(షణ్ముఖవెలుగు): లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా ఒడిశాకు చెందిన సీనియర్ ఎంపీ భర్తృహరి మహతాబ్ వ్యవహరించనున్నారు. ఈ విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఒడిశాలోని కటక్ నుంచి ఏడుసార్లు విజయం సాధించిన

మిగతా 2లో..



## యూజీసీ నెట్ జూన్-2024 పరీక్షరద్దు

అవతవకలు జరిగినట్లు గుర్తించిన కేంద్రం

సిబిఐ విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ,జూన్20(షణ్ముఖవెలుగు): జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) మంగళవారం దేశవ్యాప్తంగా నిర్వహించిన యూజీసీ నెట్ జూన్-2024 పరీక్షను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. అవకతవకలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. దేశంలోని అనేక నగరాల్లో ఓఎమ్మార్ (పెన్ను, పేపరు) విధానంలో మంగళవారం యూజీసీ నెట్ పరీక్ష జరిగింది. దీనిని ఎన్‌టీఏ రెండు షిఫ్టుల్లో నిర్వహించింది. అయితే ఇందులో అక్రమాలు జరిగాయని కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో పని చేసే భారతీయ సైబర్ నేర విచారణ సమన్వయ కేంద్రానికి (ఐసీసీసీ) చెందిన జాతీయ సైబర్ నేర హెచ్చరికల విశ్లేషణ విభాగం

మిగతా 2లో..

## వ్యవస్థలను బీజేపీ కబ్జా చేసింది

**కబ్జా చేయడం వల్లే పేపర్ లీకేజీలు**

**బీజేపీ ప్రతి పదవికి తమ వ్యక్తులను పెడుతుంది**

**విద్యా వ్యవస్థను ఒక సంస్థ కబ్జా చేసింది**

**నీట్ అవతవకలపై మోడీ నోరు మెదపరేం?**

**లీకు ఆరోపణలు వస్తున్నా చర్యలు లేవా?**

**కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ విమర్శలు**



న్యూఢిల్లీ,జూన్20(షణ్ముఖవెలుగు): దేశంలో కొనసాగుతున్న నీట్, యూజీసీ-నెట్ వివాదంపై కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ గురువారం కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. అన్ని వ్యవస్థలను భారతీయ జనతా పార్టీ స్వాధీనం చేసుకున్నందున అన్ని పేపర్ లీక్‌లు జరుగుతున్నాయని

మిగతా 2లో..

## సిఐఎస్‌ఎఫ్ ఆధీనంలోకి గన్నవరం ఎయిర్‌పోర్టు

ఇక భద్రతా వ్యవహారాలు దాని పరిధిలోకే

విజయవాడ,జూన్20(షణ్ముఖవెలుగు): గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం భద్రతను సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్సు తీసుకుంటుందని డీజీపీకి ఎయిర్ పోర్టు అథారిటీ లేఖ రాసింది. జూలై 2వ తేదీ నుంచి

మిగతా 2లో..

## నేటినుంచి ఎపి అసెంబ్లీ సమావేశాలు

తొలుత ప్రమాణం చేయనున్న చంద్రబాబు

సాధారణ ఎమ్మెల్యేగా జగన్ ప్రమాణం

ప్రొటెం స్పీకర్‌గా బుచ్చయ్య చౌదరి ప్రమాణం





అమరావతి,జూన్20(షణ్ముఖవెలుగు): అసెంబ్లీ సమావేశాలు నేటి నుంచి జరుగనున్న నేపథ్యంలో ప్రొటెం స్పీకర్‌గా తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రొటెం స్పీకర్‌గా రాజ్‌భవన్‌లో ప్రమాణం స్వీకారం చేశారు. బుచ్చయ్య చౌదరితో ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణం స్వీకారం చేయించారు. శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రెండురోజుల పాటు ప్రొటెం స్పీకర్‌గా 174 మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. సీఎం చంద్రబాబు గోరంట్లకు ఈ అవకాశం కల్పించారు. ఏడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయనను ప్రొటెం స్పీకర్‌గా నియమించారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన

మిగతా 2లో..

## నితీశ్ సర్కార్‌కు హైకోర్టు షాక్

**65శాతం రిజర్వేషన్లు చెల్లవంటూ తీర్పు**

పట్నా,జూన్20(షణ్ముఖవెలుగు): బిహార్‌లో నీతీశ్ కుమార్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను 65 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పట్నా హైకోర్టు కొట్టివేసింది. ఈ పెంపు రాజ్యాంగ విరుద్ధమన్న న్యాయస్థానం.. 65శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తూ గురువారం

మిగతా 2లో..

## ఉపాధిహామీ పనుల్లో సోషల్ ఆడిటింగ్

**నిధుల దుర్వినియోగం కాకుండా చర్యలు**

**అధికారులకు డిప్యూటి సిఎం పవన్ సూచన**

అమరావతి,జూన్20(షణ్ముఖవెలుగు): గ్రామాల్లో పకడ్బందీగా సోషల్ ఆడిట్ చేపట్టాలని అధికారులను ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు.



విజయవాడ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మంత్రి పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా అందుతున్న తీరుతెన్నులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో సోషల్ ఆడిట్ విభాగం అధికారులతోనూ సమీక్ష జరిపారు. సోషల్ ఆడిట్ పక్రియపై కూలంకషంగా చర్చించారు. సుమారు రెండున్నర గంటల సేపు సమీక్ష సమావేశం సాగింది. ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ జరిగే తీరును, నిధుల దుర్వినియోగం జరిగితే గుర్తించే పద్ధతిని అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. ఉపాధి హామీ పథకంలో నిధులను సద్వినియోగం చేసుకుంటేనే సత్ఫలితాలు వస్తాయని, ఈ విషయంలో అధికారులు బాధ్యతాయుతంగా ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారు. సోషల్ ఆడిట్ పక్కాగా జరగాలని, గ్రామాల్లో సోషల్ ఆడిట్ సభలు ప్రొటోకాల్‌ను అనుసరించి ఒక పద్ధతి ప్రకారం నిర్వహించాలని సూచించారు. అలాగే ఉపాధి హామీ నిధులు ఏ మాత్రం దుర్వినియోగం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ పక్కాగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.

## వచ్చే ఎన్నికల్లో మళ్లీమనదే అధికారం

హామీలు నెరవేర్చని చంద్రబాబుకు సింగిల్ డిజిట్

ప్రజల్లోకి వెళ్లి వారికి అండగా పోరాటం చేద్దాం

అసెంబ్లీలో పోరాడేకన్నా ప్రజల్లో ఉండడమే బెటర్

పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో జగన్ సూచన

ముఖం చాటేసిన పులువురు సీనియర్ నేతలు



అమరావతి,జూన్20(షణ్ముఖవెలుగు): ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటమిపాలైన వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, ముఖ్య నేతలతో ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ భేటీ అయ్యారు. 2029లో మళ్లీ వైసీపీనే వస్తుందంటూ వారిలో ధైర్యం నింపే ప్రయత్నం చేశారు. 2029 వచ్చే నాటికి చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తారని అన్నారు. ప్రజలు ఇవన్నీ గుర్తుపెట్టుకుని వైసీపీని

మిగతా 2లో..

## ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటన ఖరారు

ఈ నెల 25, 26 తేదీల్లో పర్యటన

అమరావతి,జూన్20(షణ్ముఖవెలుగు): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పం పర్యటన ఖరారైంది. ఈ నెల 25, 26 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటించనున్నారు. రెండు రోజులపాటు కుప్పం

మిగతా 2లో..

## బాలకృష్ణతో మాచర్ల ఎమ్మెల్యే భేటీ..!!

అమరావతి,జూన్20(షణ్ముఖవెలుగు): నందమూరి బాలకృష్ణ బిజీ బిజీగా గడుపుతున్నారు. ఒక పక్క సినిమాలు చేస్తూనే మరోపక్క పాలిటిక్స్ కూడా చేస్తున్న ఆయన ఈ మధ్యనే మూడవ సారి హిందూపురం ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ క్రమంలో టాలీవుడ్ నిర్మాతల మండలి ప్రతినిధులు

మిగతా 2లో..



## ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటన ఖరారు

మొదటిపేజీ తరువాయి..

నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఆయన కుప్పంలో పర్యటించనుండడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. చంద్రబాబు పర్యటనకు టీడీపీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. చంద్రబాబు తన పర్యటనలో భాగంగా, నియోజకవర్గంలోని టీడీపీ నేతలు, కార్యకర్తలను కలవనున్నారు. నియోజకవర్గంలోని మండలాల్లో పర్యటించి టీడీపీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించనున్నారు. తనపై నమ్మకం ఉంచి మరొకసారి గెలిపించిన ప్రజలకు చంద్రబాబు కృతజ్ఞతలు తెలపనున్నారు. చంద్రబాబు కుప్పం నియోజకవర్గం నుంచి వరుసగా 8వ సారి గెలుపొందారు. నాడు చంద్రగిరిలో ఓటమి తర్వాత కుప్పం నియోజకవర్గానికి మారిన చంద్రబాబు 1989 నుంచి ఇక్కడ ఎదురులేని ప్రస్థానం కొనసాగిస్తున్నారు.

## ఢిల్లీ మద్యం కేసులో ఊరట

మొదటిపేజీ తరువాయి..

ఉదయం (జూన్ 20న) తీర్పు రిజర్వ్ చేసిన రౌస్ అవెన్యూ కోర్టు వెకేషన్ జడ్జి నియాయ్ బిందు.. అదే సాయంత్రం బెయిల్ ఆదేశాలు జారీ చేశారు. అయితే, బెయిల్ బాండుపై సంతకం చేసేందుకు వీలుగా 48 గంటలపాటు స్టే విధించాలని న్యాయస్థానాన్ని ఈడీ కోరింది. తద్వారా ఈ తీర్పును పై కోర్టులో సవాలు చేసేందుకు వీలు కలుగుతుందని విన్నవించింది. అయినప్పటికీ ఈడీ వాదనను తోసిపుచ్చిన కోర్టు.. అందుకు నిరాకరించింది. కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేయడంపై ఆప్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆప్ నేత, ఢిల్లీ మంత్రి అతిశీ సత్యమే గెలిచిందన్నారు. సత్యానికి కొన్నిసార్లు ఇబ్బందులు రావొచ్చేమో గానీ.. ఓటమి మాత్రం ఉండదన్నారు.

## 6 రాష్ట్రాల్లో ఈవీఎంలపై ఫిర్యాదులు

మొదటిపేజీ తరువాయి..

మొత్తం 8 స్థానాల్లో బీజేపీ 3, కాంగ్రెస్ 2 స్థానాల్లో విజయం సాధించాయి. మిగిలిన 3 స్థానాల్లో ఇతర పార్టీల అభ్యర్థులు విజయం సాధించారు.హర్యానాలోని కర్నాల్ నుంచి గెలిచి మాజీ సీఎం, బీజేపీ నేత మనోహర్ లాల్ ఖట్టర్ పార్లమెంట్ చేరుకున్నారు. ఎన్డీయే ప్రభుత్వంలో కేంద్ర ఇంధన శాఖ మంత్రిగా పనిచేశారు. కాగా, ఫరీదాబాద్ నుంచి జరిగిన ఎన్నికల్లో కేంద్ర సహాయ మంత్రి కృష్ణపాల్ గుర్జార్ విజయం సాధించారు. కర్నాల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి దివ్యాంశు బుద్ధిరాజా ఈవీఎంలపై దర్యాప్తు చేయాలని కోరుతూ ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. కాగా ఫరీదాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మహేంద్ర ప్రతాప్ ఫిర్యాదు చేశారు. తమిళనాడులోని వెల్లూరు, విరుదునగర్ స్థానాల్లోని ఈవీఎంలను తనిఖీ చేయనున్నారు. వెల్లూరు నుంచి డీఎంకే అభ్యర్థి కతీర్ ఆనంద్ విజయం సాధించారు. ఈవీఎంలపై విచారణ జరిపించాలని బీజేపీ అభ్యర్థి ఏసీ షణ్ముగం డిమాండ్ చేశారు. విరుదునగర్ స్థానం నుంచి డీఎండీకే అభ్యర్థి విజయ్ ప్రభాకరన్ పీపై కాంగ్రెస్ అభ్యర్థి మాణికం ఠాగూర్ బీ విజయం సాధించారు. ఇక్కడి 14 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలను పరీక్షించనున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఈవీఎంలు చెడిపోయాయని ఫిర్యాదు చేస్తూ 8 దరఖాస్తులు వచ్చాయని ఎన్నికల సంఘం తెలిపింది. వీటిలో ఈవీఎం మెమరీ, మైక్రో కంట్రోలర్‌ను తనిఖీ చేయాలని ఆయా పార్టీలకు చెందిన నాయకులు డిమాండ్ చేశారు. ఈ 8 స్థానాల్లోని 92 పోలింగ్ స్టేషన్లలో ఈవీఎంలను కమిషన్ తనిఖీ చేయనుంది.

## లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్

మొదటిపేజీ తరువాయి..

భర్తృహరి.. స్పీకర్ ఎన్నిక పూర్తయ్యే వరకు లోక్‌సభ ప్రిసైడింగ్ అధికారిగా కార్యకలాపాలు నిర్వహిస్తారని తెలిపారు. 18వ లోక్‌సభకు కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయిస్తారని.. ఆయనకు కె.సురేష్ (కాంగ్రెస్), టీఆర్ బాలు (డీఎంకే)తో పాటు రాధామోహన్ సింగ్ (భాజపా), ఫగ్గన్ సింగ్ కులస్తే (భాజపా), సుదీప్ బంధోపాధ్యాయ (టీఎంసీ) ఛైర్‌పర్సన్‌ల ప్యానెల్ సహాయంగా ఉంటుందని మంత్రి తెలిపారు. భర్తృహరి మహతాబ్ ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ముందే బిజు జనతాదళ్‌ని వీడి భాజపాలో చేరిన విషయం తెలిసిందే. కటక్ నుంచి భాజపా అభ్యర్థిగా పోటీచేసి ఏడోసారి విజయ దుందుభి మోగించారు. మరోవైపు, 18వ లోక్‌సభ సమావేశాలు జూన్ 24 నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 24, 25 తేదీల్లో కొత్త సభ్యుల ప్రమాణస్వీకారం జరగనుంది. జూన్ 26న స్పీకర్‌ను ఎన్నుకోనున్నారు.



## వ్యవస్థలను బీజేపీ కబ్జా చేసింది

మొదటిపేజీ తరువాయి..

ఆయన ఆరోపించారు. మెడికల్ ఎంట్రన్స్ ఎగ్జామ్ నీట్‌పై తీవ్ర దుమారం రేగుతున్న నేపథ్యంలో, పరీక్షల సమగ్రత దెబ్బతినే అవకాశం ఉందన్న నేపథ్యంలో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ యూజీసి ని ని రద్దు చేయాలని ఆదేశించిందన్నారు. ఈ విషయాన్ని సీబీఐకి అప్పగించిందన్నారు రాహుల్ గాంధీ. బీజేపీ ప్రతి పదవికి తమ వ్యక్తులను పెడుతుందని, అందుకే ఈ లీకులు జరుగుతున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా విద్యా వ్యవస్థను ఒక సంస్థ కబ్జా చేసిందని ప్రతి పోస్ట్‌లో వారి వ్యక్తులను ఉంచారన్నారు ఆయన. దానిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో విద్యాసంస్థలను స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తున్నారని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అసలు భారతదేశంలో స్వతంత్ర విద్యా వ్యవస్థ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ ఛాన్స్‌లర్లను మెరిట్ ఆధారంగా నియమించాలని కానీ ప్రభుత్వం తమ వారని ఆ పదవుల్లో కూర్చోబెడుతోందని అన్నారు. బీజేపీ విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించిందన్నారు. బీజేపీ విద్యావ్యవస్థలోకి చొచ్చుకుపోయిందని అందుకే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు రాహుల్ గాంధీ. నోట్ల రద్దు ద్వారా ప్రధాని మోదీ ఆర్థిక వ్యవస్థను ఎలా కుప్పకూల్చారో ఇప్పుడు విద్యావ్యవస్థను అలానే చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్న పత్రలా లీకేజీకి ఎవరు బాధ్యత వహిస్తారని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఒక్కో పరీక్షకు ఒక్కో నిబంధన పెడుతున్నారని.. ఇది ఏమాత్రం సమంజసం కాదని అన్నారు. లీకేజీపై విద్యార్థులు రోడ్లెక్కారని.. వెంటనే నీట్ పరీక్షను రద్దు చేయాలన్నారు రాహుల్ గాంధీ.

## నితీశ్ సర్కార్‌కు హైకోర్టు షాక్

మొదటిపేజీ తరువాయి..

సంచలన తీర్పు వెలువరించింది. బిహార్ వ్యాప్తంగా కులగణన చేపట్టి ఆ నివేదికను నీతీశ్ సర్కారు గతేడాది నవంబరులో అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. అదే సమయంలో విద్య, ఉద్యోగ రంగాల్లో కల్పిస్తున్న రిజర్వేషన్లను పెంచుతూ సవరణ బిల్లును తీసుకొచ్చారు.
ఈ బిల్లుకు రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దాంతో ఎస్సీలు, ఎస్టీలు, ఇతర వెనకబడిన వర్గాలు, అణగారిన వర్గాల రిజర్వేషన్లు 50 శాతం నుంచి 65 శాతానికి పెరిగాయి. ఇక, ఆర్థికంగా వెనకబడినవారిని ఉద్దేశించిన 10శాతం రిజర్వేషన్లు కలిపితే మొత్తం రిజర్వేషన్లు 75 శాతానికి చేరాయి. ఈ పెంపుతో ఎస్సీలకు 16 నుంచి 20 శాతం, ఎస్టీలకు ఒక శాతం నుంచి రెండు శాతం, ఓబీసీ, ఈబీసీలకు కలిపి 30శాతం ఉన్న రిజర్వేషన్ 43 శాతానికి పెరిగింది. అయితే, ఈ పెంపుపై కొన్నివర్గాల నుంచి అభ్యంతరం వ్యక్తమైంది. ఈ క్రమంలోనే హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం ఈ ఏడాది మార్చిలో తీర్పును రిజర్వు చేసింది. తాజాగా 65శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తూ గురువారం తుది తీర్పు వెలువరించింది.




## వచ్చే ఎన్నికల్లో మళ్లీమనదే అధికారం

మొదటిపేజీ తరువాయి..

ఆశీర్వదిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అప్పుడు చంద్రబాబుకు కేవలం సింగిల్ డిజిట్ మాత్రమే వస్తుందని.. జరగబోయేది ఇదేనని అన్నారు. మనం విశ్వసనీయతతో రాజకీయాలు చేశాం. ప్రజలకు తోడుగా ఉండేలా, వారికి మద్దతుగా పోరాటం చేసే కార్యక్రమాలు చేస్తాం. మనకి వచ్చిన సంఖ్యాబలం కూడా చాలా తక్కువే. స్పీకర్ పదవి తీసుకునే వ్యక్తి సిగ్గులేకుండా మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. జగన్ ఓడిపోయాడు.. ఇంకా చావలేదు అని ఒకరు అంటారు. మరొకరు చచ్చే వరకు జగన్‌ను కొట్టండని అంటారు. ఇలాంటి వ్యక్తి రేపు స్పీకర్ అవుతారట. మనం ఇలాంటి కౌరవ సామ్రాజ్యం లోకి వెళ్లబోతున్నాం. అసెంబ్లీలో మనం ఏదో చేస్తామనే నమ్మకం మాత్రం నాకు లేదు. మనం ప్రజలతో కలిసి పోరాటం చేసే కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతాయి. జగన్ పాలనలో కులం, మతం చూడలేదు.. ఏ పార్టీకి ఓటు వేశారో కూడా చూడలేదు. నేడు కేవలం వారి పార్టీకి ఓటు వేయలేదనే కారణంతో కొడుతున్నారు. వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. అనేక గ్రామాలలో ఇదే విధంగా చేస్తున్నారంటే.. వారి పాపాలు పండే సమయం త్వరలోనే వస్తుంది' అని జగన్ అన్నారు. ఇకపోతే వైసీపీ నేతల విస్తృత స్థాయి భేటీలో పార్టీ అధినేత జగన్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ దాడుల్లో గాయపడిన వారిని ఆయన పరామర్శించనున్నట్లు సమాచారం. అలానే.. వైసీపీ ఓటమి బాధతో చనిపోయినవారి కుటుంబాలనూ పరామర్శించి.. ధైర్యం చెప్పనున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. డిసెంబర్ లేదా జనవరి నుంచి జగన్ ఓదార్పు ఉండే అవకాశం సమాచారం. అలాగే ఘోర పరాజయం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న వైసీపీ భవిష్యత్ కార్యాచరణపై ఫోకస్ పెడుతోంది. ఇప్పటివరకు తన ఆఫీసుకు వచ్చిన నేతలతో ఓటమిపై విశ్లేషణ చేసిన జగన్.. తాజాగా ఇటీవలి ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలు, పోటీచేసిన అభ్యర్థులతో కీలక సమావేశం నిర్వహించారు. శుక్రవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉండటంతో.. ఆయా అంశాలపై చర్చించారు. అసెంబ్లీ సెషన్స్‌లో ఎలా వ్యవహరించాలి, ప్రజా సమస్యలపై ఎలా పోరాడాలనే దానిపై వైసీపీ నేతలకు జగన్ దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీకి హాజరయ్యే విషయంలో వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి పార్టీ నేతలకు కొన్ని సంకేతాలు ఇచ్చారు. అసెంబ్లీలో ఏమీ చేయలేమని ప్రజలతో కలిసి పోరాటాలు చేయడమే మంచిదన్న అభిప్రాయాన్ని పార్టీ కార్యవర్గ సమావేశంలో వ్యాఖ్యానించారు. పాపాలు పండే కొద్దీ ప్రజలతో కలిసి, ప్రజలతో నిలబడి చేసే కార్యక్రమాలు రాబోయే రోజుల్లో ఊపందుకుంటున్నాయి. శిశుపాలుడి పాపాలు పండినట్టుగా ఇప్పటికే చంద్రబాబు పాపాలు పండుతూనే ఉన్నాయన్నారు. ప్రజల మధ్యకి గౌరవంగా వెళ్లగలుగుతామని.. కాలం గడుస్తున్న కొద్దీ మన పట్ల అభిమానం వ్యక్తమవుతుందని చెప్పుకొచ్చారు. మళ్లీ మనం రికార్డు మెజార్టీలో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. మోసపోతున్నవారికి మనం అండగా నిలవాలి. మనకార్యకర్తలకు మనం తోడుగా ఉండాలి. ఎప్పుడూ చూడని విధంగా కార్యకర్తలమీద, సానుభూతి పరులమీద దాడులు చేస్తున్నారు. కొన్ని చోట్ల అవమానాలు, ఆస్తుల నష్టాలు చేస్తున్నారు. వీళ్లందరికీ కూడా భరోసా ఇవ్వాలని పార్టీ నేతల్ని కోరారు. అసెంబ్లీలో వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా రాకపోవడంతో అసెంబ్లీకి వెళ్లే విషయంలో జగన్ ఆలోచిస్తున్నారు. గత అసెంబ్లీలో వైసీపీ సభ్యులు టీడీపీ సభ్యుల్ని తీవ్రంగా అవమానించిన ఘటనలు చోటు చేసుకున్నాయి. కొన్ని సార్లు దాడుల ఘటనలు కూడా జరిగాయి. పార్టీ అధినేత చంద్రబాబును అవమానించంతో ఇది కౌరవ సభ అని ఆరోపించి.. మళ్లీ సీఎంగానే సభలో అడుగుపెడతానని సవాల్ చేసి వెళ్లారు. ఇప్పుడు సీఎంగానే ఆయన సభలో అడుగుపెట్టనున్నారు. అయితే జగన్ కు ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా లేకుండా పోయింది. పదకొండు మంది మాత్రమే ఉన్న వైసీపీ ఎమ్మెల్యేలను పట్టించుకోరని జగన్ ను అవమానించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని భావిస్తున్నారు. అందుకే జగన్ అసెంబ్లీకి వెళ్లకుండా ప్రజల్లోనే ఉండి పోరాడాలని అనుకుంటున్నారు. ఓ ఏడాది తర్వాత ప్రజల్లోకి వెళ్తే సరిపోతుందని అనుకుంటున్నారు. అందుకే అసెంబ్లీలో ఈ సారి వైసీపీ ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం ఉండే అవకాశం తక్కువగా ఉందని భావిస్తున్నారు. కాగా వైసీపీ విస్తృతస్థాయి సమావేశానికి పలువురు నేతలు హాజరు కాలేకపోయారు. బెంగళూరు-విజయవాడ విమానం రద్దుతో హాజరుకాలేకపోతున్నట్లు పలువురు నేతలు పార్టీ ఆఫీస్‌కు సమాచారం ఇచ్చారు. ఉషశ్రీచరణ్, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, వెంకటేగౌడ్, చెవిరెడ్డి భాస్కరెడ్డి, మోహిత్‌రెడ్డి, బుర్రా మధుసూదన్, విక్రమ్, హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన దీపిక, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన రెడ్డప్ప వంటి నేతలు మీటింగ్‌కు హాజరు కాలేకపోయారు.

## ఈ రెండూ రాష్ట్రానికి జీవనాడి

మొదటిపేజీ తరువాయి..

పూర్తవుతుందనే నమ్మకంతో పోరాటాన్ని విరమించారు. రైతులందరికీ మనస్ఫూర్తిగా నమస్కారాలు. ఏపీ అంటే అమరావతి, పోలవరం. ఎవరూ పక్క రాష్ట్రాలకు వలస వెళ్లకుండా ఉండాలనే ఉద్దేశంతో ఇక్కడ రాజధాని నిర్మాణం చేపట్టామని అన్నారు. పోలవరం పూర్తయితే రాష్ట్రం మొత్తానికి నీరు వస్తుందనే ఉద్దేశంతో దానిని పూర్తి చేసేందుకు ప్రాధాన్యత ఇచ్చాం. పోలవరం పూర్తయితే రాయలసీమ రతనాల సీమగా మారుతుంది. అందుకోసం విభజన చట్టం తోడ్పాటు తీసుకున్నాం. పోలవరాన్ని వైకాపా ప్రభుత్వం గోదారిలో కలిపేసింది. రాష్ట్రానికి వరంగా మారాల్సిన పోలవరం శాపంగా మారింది. ఇటీవల ఎన్నికల్లో కూటమికి చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగని విజయం ప్రజలు కట్టబెట్టారు. వైకాపా 11 సీట్లకే పరిమితమైంది. రాజకీయాలకు పనికిరాని వ్యక్తి ముఖ్యమంత్రి అయితే ఎలా ఉంటుందో గత అయిదేళ్లు ప్రత్యక్షంగా చూశాం. అమరావతి ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాదు. కేంద్ర నిధులతో పోలవరం కట్టి, ఇక్కడి నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటే సాగునీటి రంగానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని అన్నారు. పోలవరం సందర్శించాక చాలా బాధేస్తోంది. ప్రజావేదికను కూల్చి జగన్ పాలన ప్రారంభించారు. పవిత్ర జలాలు, మట్టి తీసుకొచ్చి ప్రధాని శంకుస్థాపన చేసిన ప్రాంతం కాబట్టి ఆ మట్టే మనల్ని కాపాడింది. పవిత్రమట్టి చూసిన తర్వాత అదే అనిపించింది. కొన్ని అల్లరిమూకలు ఇక్కడ ఏర్పాటు చేసిన నమూనాలను కూడా ధ్వంసం చేశాయి. అమరావతి రైతులు వాటిని కాపాడుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేశారు. పైపులు, రోడ్డు, మట్టిని దొంగతనం చేస్తున్నా వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎక్కడ కట్టిన బిల్డింగులు



అలాగే ఉన్నాయి. ఐకానిక్ కట్టడాలన్నీ నిలిచిపోయాయి. ఎలాంటి మార్పు చేయలేదు. పూర్తి కావాల్సిన ఎన్నో పనులు నిలిపివేశారు. ఐఏఎస్, ఐపీఎస్ భవనాలు, అసెంబ్లీ బిల్డింగ్ ఉండాల్సిన చోట తుమ్మచెట్లు మొలిచాయి. రాజధాని పూర్తయి ఉంటే (చిత్రాన్ని చూపించారు) ఈ పాటికి ఇలా ఉండేది. కేంద్రం ఇచ్చిన ప్రోత్సాహంతో రాష్ట్రంలోని ప్రాంతాల్లో 11 కేంద్రీయ విద్యాసంస్థలు ఏర్పాటు చేశాం. అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం ఆనాడే స్పష్టమైన విధానం ప్రకటించామని అన్నారు. శివరామకృష్ణ కమిటీ చెప్పినట్లుగా సెంట్రల్‌లో అమరావతిని ఏర్పాటు చేశాం. అయినా రాజధానిపైన బురదజల్లే ప్రయత్నం చేశారు. అమరావతి బ్రాండ్‌ను దెబ్బతీయాలని చూశారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ అని ఆరోపించారు. విషం చిమ్మి సింగపూర్ కన్సార్టియంను తరిమేశారు. ఇక్కడి రైతులు స్వచ్ఛందంగా భూమిలిస్తే వారిపై ఎన్నో అపవాదులు వేశారు. మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడారు. అయిదేళ్ల తర్వాత మీ రాజధాని ఏది అని అడిగితే చెప్పుకోలేని పరిస్థితికి తీసుకొచ్చారు. ఇలాంటి వ్యక్తులకు ఓటేసిన వారు ఆలోచించుకోవాలి. అమరావతి, పోలవరం మాకేం సంబంధం అనుకోవద్దు. తెలుగుజాతి గర్వంగా తలెత్తుకునేలా రాజధాని నిర్మాణం ఉండాలన్నదే తమ సంకల్పమని అన్నారు. కర్నూలును ఆధునిక నగరంగా తయారు చేయాలి. 70-80 దేశాల్లో తెలుగు ప్రజలు అమరావతిని నాశనం చేయడంపై నిరసన తెలిపారు. రౌడీయిజం రాజకీయాల్లో లేకుండా చేస్తాం. అలాంటి వారిని ఉక్కుపాదంతో అణచివేస్తాం. రుషులు తపస్సులు చేసిన ప్రాంతం రుషికొండను నాశనం చేశారు. ఖజానా మొత్తం ఖాళీ అయ్యింది. లెక్కలు చూపించి.. చూపించకుండా ఎన్నో చోట్ల అప్పులు తీసుకొచ్చారు. హిరోషిమా, నాగసాకిని స్ఫూర్తిగా తీసుకొని ప్రజావేదికను జగన్ విధ్వంసానికి గుర్తుగా అలాగే ఉంచుతాం.గత సీఎంలు చేతనైతే అభివృద్ధి చేశారు. లేకుంటే ఊరుకున్నారు. జగన్ అలా చేయలేదని చంద్రబాబు తీవ్ర స్థాయిలో గత వైకాపా ప్రభుత్వంపై మండిపడ్డారు.

## నేటినుంచి ఎపి అసెంబ్లీ సమావేశాలు

మొదటిపేజీ తరువాయి..

నేపథ్యంలో ఏపీ ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి , అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, ఎస్.సవిత, నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవి, ఎమ్మెల్యేలు, ఏలూరి సాంబశివరావు, ఎం.ఎస్ రాజు, సుంకర విజయ్ కుమార్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి బుచ్చయ్య చౌదరి ఎన్నికైన విషయం తెలిసిందే. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయన పలుమార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. సీనియర్ ఎమ్మెల్యే కావడంతో ఆయనే ప్రొటెం స్పీకర్‌గా ఎంపికయ్యారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలో వచ్చిన తర్వాత తొలిసారి శాసనసభ సమావేశాలు జరగనున్నాయి. రెండు రోజుల పాటు సభా కార్యక్రమాలు జరగనున్నాయి. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నిక ఉ ఒడనున్నాయి. ఇందుకోసం ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల బుచ్చయ్య చౌదరి.. సభ్యులతో ప్రమాణం చేయించనున్నారు. గురువారం సాయంత్రం రాజ్‌భవన్‌లో ప్రొటెం స్పీకర్‌గా బుచ్చయ్య చౌదరి ప్రమాణం చేసారు. సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయించనున్నారు. తొలుత ముఖ్యమంత్రి చంద్రబాబు, అనంతరం డిప్యూటీ సీఎంలు ప్రమాణం చేయనున్నారు. సాధారణ సభ్యుడిగానే వైసీపీ




అధినేత జగన్ ప్రమాణం చేయనున్నారు. ప్రతిపక్ష హోదా లేకపోవడంతో సాధారణ సభ్యుడిగానే జగన్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆంగ్ల అక్షరాల ప్రాతిపదిక వరుస క్రమంలో ఎమ్మెల్యేలు ప్రమాణం చేయనున్నారు. అయితే ఈ అసెంబ్లీ సమావేశాలకు విజిటింగ్ పాసులు రద్దు చేశారు. ఈ విషయాన్ని ఏపీ శాసనసభ అధికారులు వెల్లడించారు. అసెంబ్లీలో స్థలాభావం కారణంగా విజిటింగ్ పాసులు రద్దు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు కూడా విజిటింగ్ పాసులు ఇవ్వట్లేదని వెల్లడించారు. విజిటింగ్ పాసులు రద్దు చేయడంతో ఎమ్మెల్యేల కుటుంబసభ్యులు కూడా అసెంబ్లీలోకి వెళ్లే అవకాశం ఉండదు. తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన తమవారు ప్రమాణ స్వీకారం చేస్తుంటే ప్రత్యక్షంగా చూసే అవకాశం వారి కుటుంబసభ్యులకు ఉండదు.తంలో శంకుస్థాపన చేసిన ప్రాంతంలో చంద్రబాబు మోకరిల్లారు.. వైకాపా ప్రభుత్వ కక్ష సాధింపుతో నిర్లక్ష్యానికి గురైన పలు నిర్మాణాలు, రాజధాని ప్రాంత స్థితిగతుల్ని సీఎం తెలుసుకున్నారు. అమరావతి నిర్మాణాల పరిశీలనలో భాగంగా ఉండవల్లిలోని తన నివాసం నుంచి బయల్దేరారు. తొలుత ప్రజావేదిక శిథిలాలను సీఎం పరిశీలించారు. అనంతరం ఉద్దండరాయునిపాలెం వెళ్లారు. రాజధాని నిర్మాణానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని సందర్శించారు. ఆ ప్రదేశంలో ప్రణమిల్లారు. మోకాళ్లపై కూర్చొని నమస్కరించారు. గతంలో సేకరించిన మట్టికి అక్కడ పూజలు చేశారు. రాజధాని ప్రాంతంలో సీఎం పర్యటన నేపథ్యంలో పెద్ద ఎత్తున అమరావతి ప్రాంత రైతులు, తెదేపా కార్యకర్తలు తరలివచ్చారు. జై చంద్రబాబు, జై అమరావతి నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. శంకుస్థాపన ప్రాంతం పరిశీలిన అనంతరం సీడ్ యాక్సెస్ రోడ్, అసంపూర్తిగా మిగిలిన అఖిల భారత సర్వీసు అధికారులు, మంత్రులు, న్యాయమూర్తుల గృహ సముదాయాలను చంద్రబాబు పరిశీలించారు.

## నీట్ పేపర్ లీకేజీ బట్టబయలు

మొదటిపేజీ తరువాయి..

ఇందులోభాగంగానే ఇప్పటివరకు 14 మందిని అరెస్టు చేశారు. వీరిలో బిహార్ ప్రభుత్వ విభాగంలో పనిచేసే ఓ జూనియర్ ఇంజినీర్‌తో పాటు ముగ్గురు నీట్ అభ్యర్థులు కూడా ఉన్నారు. వీరిలో ఓ అభ్యర్థి జూనియర్ ఇంజినీర్‌కు స్వయానా మేనల్లుడు కావడం గమనార్హం. రాజస్థాన్‌లోని కోటాలో నీట్‌కు ప్రిపేర్ అవుతున్న నాకు మామయ్య ఫోన్ చేశారు. పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు చేశానని, ఇంటికి రమ్మని పిలిచారు. నీట్ పరీక్ష మే 5 తేదీకి ఒక రోజు ముందు అంటే మే 4వ తేదీ రాత్రి నా స్నేహితులను తీసుకుని నేను మామయ్య వద్దకు వెళ్లాను. అక్కడ నాకు నీట్ ప్రశ్నపత్రం, ఆన్సర్ షీట్ ఇచ్చారు. రాత్రంతా వాటిని మేం బట్టీపట్టాం. మరుసటి రోజు పరీక్షా కేంద్రానికి వెళ్లిన తర్వాత ప్రశ్నపత్రాన్ని చూస్తే.. ముందు రోజు మామయ్య ఇచ్చిన పేపర్‌తో పూర్తిగా మ్యాచ్ అయ్యింది' అని ఆ నీట్ అభ్యర్థి పోలీసులకు వెల్లడించాడు. ఇదే విషయాన్ని లిఖిత పూర్వకంగా రాసిచ్చాడు. దీంతో నీట్ అక్రమాల వ్యవహారం మరింత తీవ్రమైంది. మరోవైపు, నీట్ పరీక్షలో అవకతవకలపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం మరోసారి విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై పలు హైకోర్టుల్లో జరుగుతున్న విచారణలపై అత్యున్నత న్యాయస్థానం స్టే విధించింది. అన్ని పిటిషన్లను సుప్రీంకు బదిలీ చేయాలని జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ కోరడంతో ధర్మాసనం ఈ ఉత్తర్వులిచ్చింది. ఇదే సమయంలో నీట్ యూజీ 2024 పరీక్ష రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సమాధానం చెప్పాలని కేంద్రం, ఎన్‌టీఏకు నోటీసులు జారీ చేసింది. అయితే నీట్ కౌన్సెలింగ్ ప్రక్రియను ఆపేది లేదని న్యాయస్థానం పునరుద్ఘాటించింది.నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై నివేదిక ఇవ్వాలని బిహార్ ఆర్థిక నేరాల దర్యాప్తు విభాగాన్ని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆ రాష్ట్రంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని వార్తలు వచ్చిన నేపథ్యంలో బుధవారం కేంద్రం ఈ ఆదేశాలిచ్చింది. ప్రశ్న పత్రం లీకేజీతోపాటు మరిన్ని అక్రమాలు జరిగాయనే ఆరోపణలొచ్చాయి.

## యూజీసీ నెట్ జూన్-2024 పరీక్షరద్దు

మొదటిపేజీ తరువాయి..

బుధవారం యూజీసీకి నివేదిక ఇచ్చింది. అందులోని వివరాల ప్రకారం.. పరీక్షల్లో అవకతవకలు జరిగాయనడానికి ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని యూజీసీ నిర్ధారించింది. దీంతో పారదర్శకత, విశ్వసనీయత కోసం ఈ పరీక్షను రద్దు చేస్తున్నామని కేంద్ర విద్యాశాఖ బుధవారం ప్రకటించింది. త్వరలో మళ్లీ పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించింది. తేదీని తరువాత ప్రకటిస్తామని తెలిపింది. అదే సమయంలో అవకతవకలపై దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తున్నామని వెల్లడించింది. యూజీసీ నెట్ పరీక్షకు దాదాపు 11 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు అర్హత సాధించడానికి, పీహెచ్‌డీల్లో ప్రవేశాలకు, విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాలకు అర్హత సాధించడానికి ఈ పరీక్షను కేంద్రం నిర్వహిస్తోంది. ఇప్పటికే ఎన్‌టీఏ నిర్వహించిన నీట్ పరీక్షపై తీవ్ర వివాదాలు ముసురుకున్న నేపథ్యంలో నెట్ పరీక్షలోనూ అవకతకవలు జరగడం, పరీక్ష రద్దు కావడం సంచలనం సృష్టించింది.

## బాలకృష్ణతో మాచర్ల ఎమ్మెల్యే భేటీ..!!

మొదటిపేజీ తరువాయి..

నందమూరి బాలకృష్ణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టాలీవుడ్‌కు బాలయ్య ఎంట్రీ ఇచ్చి 50 ఏళ్ళు పూర్తి చేసుకోవడంతో పాటు అసెంబ్లీ ఎన్నికలలో ఘనవిజయం సాధించినందుకు వారు శుభాకాంక్షలు తెలిపారు. మొన్న ఈమధ్యనే జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో నందమూరి బాలకృష్ణ హిందూపురం నుంచి పోటీచేసి ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ఇప్పటికే హిందూపురం నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలయ్య తాజాగా హ్యాట్రిక్ విజయాన్ని అందుకున్నాడు. ఇంకోపక్క బాలయ్య తెలుగు సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టి 50 ఏళ్ళు పూర్తి చేసుకున్నారు. దీంతో టాలీవుడ్ నిర్మాతల మండలి, తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి, తెలంగాణ స్టేట్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి అధ్యక్షులు కె.ఎల్. దామోదర్ ప్రసాద్, కార్యదర్శి టి. ప్రసన్నకుమార్, ఈసీ మెంబర్ వి. వెంకటరమణ రెడ్డి (దిల్ రాజు), తెలంగాణ స్టేట్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి కె. అనుపం రెడ్డి, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మాదాల రవి తదితరులు ఉన్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే బాలకృష్ణను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి కలిశారు. ప్రస్తుతం బాలయ్య విజయవాడలో ఉన్నారు. ఈ క్రమంలో జూలకంటి బ్రహ్మానంద రెడ్డి మర్యాద పూర్వకంగా ఆయనని కలిసినట్టు చెబుతున్నారు. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే పిన్నెల్లి మీద జూలకంటి బ్రహ్మానంద రెడ్డి గట్టి మెజారిటీతో గెలిచారు.

## సిఐఎస్ఎఫ్ ఆధీనంలోకి గన్నవరం ఎయిర్‌పోర్టు

మొదటిపేజీ తరువాయి..

సీఐఎస్ఎఫ్ ఆధీనంలోకి విమానాశ్రయం భద్రత వెళ్తుందని లేఖలో పేర్కొంది. సీఐఎస్ఎఫ్ అధీనంలోకి వచ్చిన వెంటనే అక్కడ భద్రతా విధుల్లో ఉన్న రాష్ట్ర ఎస్పీఎఫ్ విభాగాన్ని ఉప సంహరించాలని లేఖలో వెల్లడించింది. జూలై 2 నుంచి భద్రతా విధులు చేపట్టనున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది కోసం బారక్‌లు కూడా ఖాళీ చేయాలని డీజీపీని ఎయిర్ పోర్ట్ అథారిటీ కోరింది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) భద్రతను పెంచాలని నిర్ణయించి సీఐఎస్ఎఫ్‌కు బాధ్యతలు అప్పగించింది. ఒమన్, కువైట్, కొన్ని ఇతర మధ్యప్రాచ్య దేశాలకు విమానాలు ప్రారంభించిన తర్వాత కేంద్ర ప్రభుత్వం 2017 మేలో గన్నవరం విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదాను మంజూరు చేసింది. ప్రస్తుతం గన్నవరం విమానాశ్రయంలో 400 మంది పోలీసులు వివిధ విభాగాల్లో బందోబస్తు నిర్వహిస్తున్నారు. వీఐపీ సందర్శనల సందర్భంగా అదనపు బలగాలను మోహరిస్తున్నారు. ప్రస్తుతం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ లగేజీ చెకింగ్ ప్రాంతం భద్రతను పర్యవేక్షిస్తుంది, అయితే ఏపీఎస్పీ బయటి ప్రాంతాన్ని చూసుకుంటుంది. సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్నారు. వీటితోపాటు బాంబ్ డిటెక్షన్ (బీడీ), హ్యాండ్‌హెల్డ్ మెటల్ డిటెక్టర్లు, రోడ్ ఓపెన్ పార్టీలు, డాగ్ స్క్వాడ్‌లను వీఐపీ సందర్శనల సమయంలో మోహరిస్తారు. డీఎస్పీ స్థాయి అధికారి ఒకరు అంతర్జాతీయ విమానాశ్రయంలో 24 గంటలూ భద్రతను పర్యవేక్షిస్తున్నారు. దేశీయ విమానాలతో పాటు అంతర్జాతీయ విమానాలు ఇక్కడకు వస్తున్నందున గన్నవరం విమానాశ్రయంలో భద్రతను పెంచాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# సమాజంలో వస్తున్న మార్పులకనుగుణంగా విద్యా బోధన చేయాలి

## కలెక్టర్ దినేష్ కుమార్



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 20)

అంతర్జాతీయ సమాజంలో వస్తున్న మార్పులు, ఉద్యోగ అవకాశాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఆయా అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ అన్నారు. జిల్లాలోని ఎంపిక చేసిన 20 పాఠశాలు, కె.జి.బి.వి.లు, ఏ.పి. మోడల్ స్కూల్స్, ఒకేషనల్ కోర్సులు కలిగిన జూనియర్ లెక్చరర్లకు గురువారం కొప్పోలులోని నెక్సెన్ స్కూల్లో మూడు రోజులపాటు జరిగే కెరీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాముపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి దశను పూర్తి చేసుకుని ఉత్తమ పౌరులుగా పిల్లలు ఎదగడానికి టీచర్ల మార్గదర్శకత్వం ఎంతో కీలకమన్నారు. విద్యార్థుల ప్రతిభ, వారి ఆసక్తిని గమనించి వారికి ఉద్యోగ అవకాశాలు లభించే కోర్సుల గురించి కూడా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులలో సృజనాత్మకత (తరువాయి 4లో...)

## రెవెన్యూ మంత్రి అనగానిని కలిసిన మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు ఏలూరి, కందుల



4



## మార్కాపురం సబ్ డివిజన్లో పర్యటించిన కేంద్ర బృందం

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇంచార్జ్, జూన్ 20)

మండలంలోని వేములకోట చెరువును, పెద్దరవీడు మండలంలోని గొబ్బూరు గ్రామంలో పంట పొలాలను గురువారం కేంద్ర బృందం పరిశీలించింది. అలాగే మండలంలోని కోలభీమునిపాడు గ్రామంలో రైతులతో కేంద్ర బృందంలోని అధికారులు ముఖాముఖి నిర్వహించారు. (తరువాయి 4లో...)






# సమాజంలో వస్తున్న మార్పులకనుగుణంగా విద్యా బోధన చేయాలి



అధికంగా ఉంటుందని, విద్యా వ్యవస్థను కూడా ఆ స్థాయికి తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో గ్లోబల్ ఎడ్యుకేషనల్ సొల్యూషన్స్ సంస్థ సి.ఈ.ఓ. రాక్వెల్ షరాఫ్, ఆస్ట్రేలియాకు చెందిన సబ్జెక్ట్ ఎక్స్పర్ట్ శారా ఆండర్సన్ల సహకారంతో జిల్లాలోని విద్యార్థులకు ఉపయోగపడేలా టీచర్లకు అవగాహన కల్పించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు జిల్లాలోని ఇతర ఉపాధ్యాయులకు, పాఠశాలలకు స్ఫూర్తిగా నిలవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రొఫెసర్ మంజునాథ్, ప్రాజెక్ట్ హెడ్ యశశ్విని, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అనూష, ఎస్.సి.ఈ.ఆర్.టి. నుంచి సుధా లక్ష్మి, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డు నుంచి ప్రొఫెసర్ డాక్టర్ జి.ఎస్.ఆర్. కృష్ణారావు, అకడమిక్ కౌన్సిలర్ పింకీమిశ్రా మాట్లాడుతూ తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బి.సుభద్ర, డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ సుబ్బారావు, ఏ.ఎం.ఓ. రమేష్, డైట్ లెక్చరర్ రవీంద్ర ప్రసాద్, ఇతర విద్యా శాఖ అధికారులు, ఎం.ఈ.ఓ.లు పాల్గొన్నారు.

# రెవెన్యూ మంత్రి అనగానిని కలిసిన మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు ఏలూరి, కందుల



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 20)** రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో తన ఛాంబర్లో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలు కలసి బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఛాంబర్లో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి లు ఉమ్మడి ప్రకాశం జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులు వెలుగొండ ప్రాజెక్ట్, గుండ్లకమ్మ ప్రాజెక్టులపై ప్రకాశం జిల్లా ఇరిగేషన్ ఎస్ఈతో సమీక్ష సమావేశం నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు.

# మార్కాపురం సబ్ డివిజన్లో పర్యటించిన కేంద్ర బృందం

2023 రబీ పంటలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందుకు సంబంధించి ఆధారాలను సేకరించారు. త్వరలోనే ఈ పంటకు సంబంధించి ఈక్రాప్, నష్టపరిహారం, కానీ రైతులకు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు మార్కాపురం డివిజన్ సబ్ కలెక్టర్ సేతు మాధవ్, మార్కాపురం ఎంపీడీవో తోట చందన, పెద్దారవీడు ఎంపీడీవో రాజకుమార్ నాయక్ ఎమ్మార్వో రవి, అగ్రికల్చర్ ఆఫీసర్లు లక్ష్మీనారాయణ, బుజ్జి బాయ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# దేవరపాలెంలో వైసీపీ నేతల దౌర్జన్యానికి చెల్లుచీటీ

- ప్లాట్ల కొనుగోలుదారులకు ఎట్టకేలకు న్యాయం
- స్పందించిన రెవెన్యూ, పోలీస్ అధికారులు
- ఎమ్మెల్యే కోటంరెడ్డి దృష్టికి సమస్య రావడంతో వెంటనే పరిష్కారం
- భూ ఆక్రమణదారులకు ఎదురుదెబ్బ





**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 20)**

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని దేవరపాలెం గ్రామంలో ఇప్పటివరకు వైసిపి నేతల ఆక్రమణలో ఉన్న భూములకు ఎట్టకేలకు గురువారం మోక్షం కలిగింది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఘన విజయం సాధించడంతో కొందరు బాధితులు ఆయనను ఆశ్రయించి తమ సమస్యను తెలియజేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. దేవరపాలెం గ్రామంలో సర్వేనెంబర్ 238, 39 389 లో మొత్తం 18. 23 ఎకరాల భూమిని వైసిపి నేతలు వేమిరెడ్డి అశోక్ రెడ్డి, ఆనందరెడ్డి, హంస కుమార్‌రెడ్డి తదితరులు 2003లో అమ్మకాలు చేశారు. వీటిని కొంత మంది ముందుకు వచ్చి కొనుగోలు చేసి ఆ స్థలంలో ఫ్లాట్ లను ఏర్పాటు చేశారు. అయితే ఆదాల ప్రభాకర్ రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బాధ్యతలు చేపట్టిన తర్వాత గత ఏడాది జనవరిలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు వేమిరెడ్డి అశోక్‌రెడ్డి, ఆనందరెడ్డి, హంస కుమార్‌రెడ్డి, తదితరులు అమ్మిన స్థలాన్ని కూడా తిరిగి ఫెన్సింగ్ వేసి ఆక్రమించారు. అదేమని అడిగితే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని చెప్పడంతో వారు బెంబేలెత్తి అధికార పార్టీ నేతల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లిన వారికి న్యాయం జరగలేదు. రూరల్ ఎమ్మెల్యేగా కోటంరెడ్డి బాధ్యతలు స్వీకరించగానే పలువురు బాధితులు ఆయన దగ్గరకు వెళ్లి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు వెంటనే ఆయన ఈ విషయాన్ని రెవిన్యూ , పోలీస్ అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. వారు గురువారం స్పందించి స్థలాన్ని కొనుగోలు చేసిన ప్ కొనుగోలుదారులకు సుమారు 90 ప్లాట్లను అప్పగించారు. దగ్గరుండి హద్దులు చూపించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, ఇతర అధికారులు పాల్గొన్నారు. తమకు న్యాయం జరగడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో ముగ్గురికి రిమాండ్



**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జూన్ 20)** ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన కేసులో మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారిని కనిగిరి కోర్టులో హాజరు పరచగా ముగ్గురికి రిమాండ్ విధించారు. మండలంలోని పెద్ద వెంకటాయపల్లిలో సర్వే నెం.1 లోని 120 ఎకరాల ప్రభుత్వ భూమిని బోగస్ సర్వే నెంబర్లతో వినుకొండకు చెందిన గుర్రం అనంత కృష్ణకు అక్రమ రిజిస్ట్రేషన్ చేశారు. మండలంలోని అగ్రహారంకు చెందిన సూరబోయిన బాలయ్య వారి కుటుంబీకులు అక్రమ రిజిస్ట్రేషన్ చేశారు. ఈ కేసులో గతంలో కొందరిని అరెస్టు చేయగా రిమాండ్‌కు వెళ్ళారు. అయితే ఈ కేసులో ఏ1 గా ఉన్న సూరబోయిన బాలయ్య ఆ అక్రమ రిజిస్ట్రేషన్‌కు సాక్షులుగా ఉన్న జయబాబు, బాల నరసింహంలను పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. వారి ముగ్గురికి కనిగిరి కోర్టు రిమాండ్ విధించింది. అక్రమ రిజిస్ట్రేషన్ పై అప్పటి తహసీల్దార్ హరిబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన విషయం పాఠకులకు విధితమే...

# రజకులకు ఉపయోగంగా దోబీ ఘాట్ చదును టిడిపి మండల అధ్యక్షులు రావి లక్ష్మీ నరసారెడ్డి

(షణ్ముఖ వెలుగు, చేజర్ల, జూన్ 20) గ్రామంలోని రజకులకు సంబంధించిన దోబీ ఘాట్ లో గత 5 సంవత్సరాలనుండి అభివృద్ధి నోచుకోక నిరుపయోగంగా ఉన్నది. గురువారం చేజర్ల గ్రామ రజక సోదరులు అందరూ కలసి చేజర్ల మండల టీడీపీ అధ్యక్షులు రావి లక్ష్మీ నరసారెడ్డిని కలసి మా వృత్తి కొరకు నిరూపయోగంగా వున్న దోబీ ఘాట్ ను ఉపయోగ పడేలా తమరు చొరవ తీసుకోవాలి అని కోరుకున్నారు.వెనువెంటనే అక్కడికి వెళ్లి చూసి వెంటనే దోబీ ఘాట్ చుట్టూ జెసిబి తో చదును చేపించి దోబీ ఘాట్ కు అవసరమైన కరెంటు మరమ్మత్తుల కొరకు కరెంట్ వారిని పిలిపించి తక్షణమే అందుబాటులోకి తీసుకురావటం జరిగింది. పైపులైన్లు వేయించడం జరిగింది. దీంతో చేజర్ల గ్రామ రజకులు రావి లక్ష్మీనరసారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.



# ఆటో బాడుగ అడిగినందుకు వికలాంగుడిపై దాడి



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జూన్ 20)**

ఉమ్మడి నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట మండలం బాపూజీ కాలనీ పరిధిలో రెండు రోజులు క్రితం తుపాకుల చంద్ర అనే వికలాంగుడు అతను ఆటోని నడుపుకుని జీవనం సాగించే వాడు. ఆటో జీవనాధారంగా పెట్టుకొని చిన్న, చిన్న కరెంటు లైట్లు వేసుకుంటూ జీవనం సాగిస్తుండగా, అతని వద్దకు ఎల్లమల గణేష్ 19 ఏళ్ల కుర్రోడు వచ్చి వరదయ్యపాలెం మండలం దగ్గరలోని వాటర్ ఫాల్స్‌కి వెళ్లాలని అతని ఆటోని బాడుగకు తీసుకొని పోవడానికి రూ.500ల డీజిల్‌కి ఇవ్వగా రూ.2000లు బాడుగ మాట్లాడుకుని మిగతా రూ.1500ల బాడుగ వెళ్లి వచ్చిన తర్వాత ఇస్తాను అని చెప్పి ఒక రోజు గడిపిన తర్వాత చంద్ర అనే వికలాంగుడు యనమల గణేష్‌కి ఫోన్ చేసి మిగతా డబ్బులు అడగగా అతన్ని కులం పేరుతో దుర్భషలాడి అతన్ని ఎస్టీ కులానికి చెందిన వాడు కాబట్టి కులం పేరుతో దుర్భషలాడి రారా చూసుకుందాం నీకు రెండు కాళ్లు లేవు నువ్వు ఎస్టీ కులానికి చెందిన వాడివి వస్తున్నా ఉండు రా అని చెప్పి ఇంటి వద్దకు వస్తే చేతులు రెండూ ఇరిచేస్తను నువ్వు ఎంత నీ బతుకు ఎంత నా కొడకా అంటూ ఇంటికి వచ్చి అతన్ని కొట్టి అడ్డం వచ్చిన వాళ్ళ భార్యను, పిల్లలని కడుపుతో ఉన్న భార్యను అని కూడా చూడకుండా అమ్మాయిని కొట్టి వాళ్ళ అమ్మను కొట్టి అతను ఆటోను అద్దాలు పగలగొట్టి ధ్వంసం చేసి నీకు దిక్కు ఉన్న చోటు చెప్పుకోరా నేను ఏం చేసినా నన్ను తీసుకొచ్చే వాళ్ళ నా వెనకాల చాలామంది ఉన్నారన్నారు. నేను ఎవరికి భయపడను ఆల్రెడీ నేను జైలుకు పోయి వచ్చిన వాడిని అని వాళ్లను భయభ్రాంతులకు గురిచేసి అక్కడ నుంచి వారి అమ్మ ధనలక్ష్మి అనే ఆమెని సపోర్టు చూసుకొని ఇద్దరు వచ్చి వారిని ఇబ్బంది పెట్టి వెళ్ళగా వీళ్ళందరూ కలిసి గ్రామస్తులు సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్‌కి వచ్చి కేసు పెట్టారు. ఆ కేసుని అట్రాసిటీ కేసుగా పరిగణలోకి తీసుకొని డిఎస్పీ విచారణలో ఉంది. ఈ సంఘటనకి గ్రామస్తులు అందరూ స్పందించి ఆ వికలాంగుడికి న్యాయం చేయాలని వీసీకే పార్టీ తరఫున మల్చి చెంగయ్య గురుమూర్తి శ్యాము, మానవ హక్కుల కమిషన్ ఎస్కే మస్తాన్ సాహెబ్, వి విష్ణుకాంత్ , ఏ లక్ష్మమ్మ అనే పెద్దలు వారికి అండగా నిలబడ్డారు. ఈ సంఘటన జరిగినప్పుడు నుంచి అతను ఆటో తిరగక అతను ఎటువంటి ఉపాధి లేకుండా వారి బిడ్డలు వాళ్ళ తల్లిదండ్రులు ఆకలితో చాలా కష్టాలు పడుతున్నారు. బాపూజీ కాలనీ కాపురస్తుడు శ్యాంసుందర్ అతను సోషల్‌గా అందరికీ సహాయ పడే వ్యక్తి అందరి మంచికి కష్టం వచ్చిన వారికి ఆక్కును చేర్చుకొని వాళ్ళ తరఫున అండగా ఉండి బాధితులకు న్యాయం చేయాలని అందరిని ఆయన కోరారు.

# మేజర్ అయిన అమ్మాయిని బాల సదనం నుంచి అధికారులకి అప్పగింత




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 20)** జిల్లా బాలల సంక్షేమ కమిటీ ఆజ్ఞ ప్రకారం ఒంగోలు ప్రభుత్వ బాలసదనంలో ఆశ్రయం పొందుచున్న ఎం.దేవిక 18 ఏళ్లు పూర్తి అయినందున బాలల న్యాయ చట్టంను అనుసరించి రక్షణ, సంరక్షణ నిమిత్తం మహిళాభివృద్ధి , శిశు సంక్షేమ శాఖ కార్యాలయ అధికారి నోడల్ ఆఫీసర్ జి.సులోచన కి జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్పర్సన్ వేము.రామాజినేయులు, కమిటీ సభ్యులు టి.శివశంకర్, కె.సుమానశ్రీ వారు ఆమెను అప్పగించారు. ఎం.దేవిక తల్లిదండ్రులు చనిపోవడంతో వారి అమ్మమ్మ సంరక్షణలో ఉంటూ 2012 సంవత్సరంలో ఒంగోలు బాలసదనంలో రక్షణ, సంరక్షణ నిమిత్తం జిల్లా బాలల సంక్షేమ కమిటీ ప్రకాశం జిల్లా వారు రక్షణ, సంరక్షణ నిమిత్తం ఆశ్రయం కల్పించారు. బాలసదనంలో 1 నుంచి 5వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువు కొనసాగించిన అనంతరం జిల్లా బాలల సంక్షేమ కమిటీ ప్రకాశం జిల్లా వారి ఉత్తర్వుల మేరకు 6నుంచి 10వ తరగతి వరకు కేజీబీవీ చినగంజం మండలంలో 10వ తరగతి పూర్తి చేసి అనంతరం కాలేజ్ ఎట్ హోమ్ గుంటూరు నందు ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. అనంతరం ఒంగోలు బాలసదనంలో ఆశ్రయం కల్పించారు. ఎం.దేవికకు ఈ నెల 14వ తేదీ నాటికీ 18 సంవత్సరాలు పూర్తయినందున జిల్లా మహిళాభివృద్ధి ,శిశు సంక్షేమ శాఖ, సాధికారత అధికారిణి వారికి ఆమె యొక్క రక్షణ , సంరక్షణ, వృత్తి విద్య శిక్షణ కల్పించేందుకు అనంతరం పునరావాసం ప్రక్రియ అమలు చేయుటకు స్వధార్ హెూమ్ లేదా స్టేట్ హెూంలో ఆశ్రయం కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పర్యవేక్షణ అధికారి, బాల ప్రభాకర్ , బాలసదన్ సూపరింటెండెంట్ డి.జీవిత , బాలల సంరక్షణ అధికారి ఇన్స్టిట్యూషనల్ కేర్ కె.శేఖర్ బాబు పాల్గొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవ కార్యక్రమం






**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జూన్ 20)**
మండల తహశీల్దార్ వారి ఆధ్వర్యంలో మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లకి వారు తెలిపిన సూచనలను రెవెన్యూ సమస్యలు గురించి ఎలాంటి ఆక్షేపణలు ప్రజలకి ఎలాగ ఉపయోగపడుతుందో ప్రజలకి పూర్తి అవగాహన తెలిపి వాటిని పూర్తిగా ప్రజలు వినియోగించుకునే విధంగా చేయాలని హనుమంతుని పాడు తహశీల్దార్ కొంగలవీటి కేశవ కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమంతునిపాడు మండల కార్యాలయ సిబ్బంది , ప్రజలు పాల్గొన్నారు.

# భోగ శ్రీనివాసమూర్తికి వెండి సింహాసనం సమర్పణ

## శ్రీగిరి దేవస్థానం చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 20)**
ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో భోగ శ్రీనివాసమూర్తికి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, శ్రీలత, బొత్తుల సుభాష్ చంద్ర పాల్గొన్నారు.



భవాని, శ్రీగిరి దేవస్థానం కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ఇందిరా దేవి దంపతులు ప్రధాన దాతలుగా వ్యవహరించారు. భోగ శ్రీనివాసమూర్తికి వెండి సింహాసనం సమర్పించిన దాతలను శ్రీగిరి ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, ధర్మకర్తలు ఆలూరు వేంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారీ, తదితరులు అభినందించారు.

# సినీ నటుడు, హిందూపూర్ ఎమ్మెల్యే బాలకృష్ణను కలిసిన బ్రహ్మారెడ్డి



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జూన్ 20)**
సినీ నటుడు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి గురువారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మాచర్ల నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు ఎన్నికల రోజున ఎన్నికల అనంతరం జరిగిన గొడవల గురించి బాలకృష్ణ ఆరా తీశారు. నియోజకవర్గ అభివృద్ధిపై తీసుకోవలసిన చర్యలు, ఇతర అంశాలపై వారిద్దరూ చర్చించారు. మాచర్ల నియోజకవర్గం అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు తన వంతు సహాయ , సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికి తెలిపారు.

## వికలాంగుల పింఛన్ పెంచిన

# ఘనత చంద్రబాబుదే

### రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి ఎర్రమోతు శ్రీనివాసులు



**(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, జూన్ 20)**
సార్వత్రిక ఎన్నికల హామీలో భాగంగా వికలాంగులకు రూ.3000 నుంచి రూ.6000లకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందని రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి ఎర్రమోతు శ్రీనివాసులు అన్నారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రమైన మరిపూడి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ విహెచ్‌పి ఎస్ ఆధ్వర్యంలో జరిగిన కృతజ్ఞతా సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈసభకు జిల్లా మాదిగ జర్నలిస్టు ఫారం అధ్యక్షుడు (ఎంజెఎఫ్) నాయకులు గురిజాల నరసింహారావు(బాబురావు) అధ్యక్షత వహించారు. రాష్ట్ర వికలాంగుల హక్కుల సీనియర్ నాయకులు వనిపెంట గురువారెడ్డి ప్రసంగిస్తూ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఆనాడు గుంటూరులో జరిగిన వికలాంగుల సభలో ఎన్నికల హామీలో భాగంగా నూతన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని అడగడం జరిగింది. రూ.3000గా ఉన్న పింఛన్ రూ.6000కు పెంచమని అడిగితే మంచి మనసుతో పెంచడం జరిగిందని ఐదు సంతకాలలో ఒక సంతకం వికలాంగులు పెన్షన్ కోసం పెట్టడం అహర్నిశ్యమని కొనియాడారు. మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ సిహెచ్ నర్సారెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. మాజీ జెడ్పిటిసి సభ్యులు తుళ్లూరి నరసింహారావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీల సంక్షేమం కోసం పెద్ద పేట వేయనుందన్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రేగుల వీరనారాయణ మాట్లాడుతూ రాష్ట్రం అప్పులు ఊబిలో కూరుకుపోయిన పేదల సంక్షేమం కోసం చంద్రబాబు నాయుడు అనేక పథకాలను ప్రవేశ పెడుతున్నారని కొనియాడారు. అంతకుముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మార్పీఎస్ వీహెచ్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఫోటోలుతో తయారుచేసిన కేక్‌ను ఎమ్మార్పీఎస్ వీహెచ్పిఎస్ టిడిపి నాయకులు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు గురిజాల పోలయ్య, జిల్లా తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ నాయకులు వేముల రమేష్, మాజీ జెడ్పిటిసి సభ్యులు సారెడ్డి యోగి రెడ్డి,కొండేపి నియోజకవర్గ వికలాంగుల హక్కుల నాయకులు అంబటి రాంబాబు,చిన్ను బోయిన సుబ్బారావు,కె.నరసింహం, ఉప్పు సుబ్బారావు, అలవల లక్ష్మి, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఎంఆర్పీఎస్ వీహెచ్పిఎస్ ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మార్కాపురంను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

### ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘ డిమాండ్



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 20)**
ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం మార్కాపురం వచ్చిన కేంద్ర ఇంటర్ మినిస్ట్రియల్ సెంట్రల్ టీం అధికారికి మార్కాపురం ఏరియాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని, అడుగంటి పోయిన నీటి మట్టాన్ని పెంచే విధంగా చెక్ డౌన్ నిర్మాణం చేయాలని అన్ని చెరువుల మరమ్మతు చేయాలని, డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని వారికి అందజేశారు. ఈ ఏడాది కాలంలో పంటలు నష్టపోయినా రైతులకు బ్యాంకు రుణాలను రద్దు చేయాలని, 2024-25 సంవత్సరం సంబంధించిన బ్యాంకు రుణాలను వడ్డీ లేని రుణం రెండు లక్షల రూపాయలు ఇవ్వాలని, అలాగే కరువు ప్రాంతంగా ప్రకటించి కరువు, సహాయక చర్యలను చేపట్టాలని, ఉపాధి కార్మికులకు ఉపాధి కల్పించాలని 2 వందల రోజుల పని దినాలతో పాటు రోజువారిగా 600 రూపాయల కూలిన ఇవ్వాలని, అలాగే మార్కాపురం ప్రాంతని సస్యశ్యామలంగా మారాలంటే వెలుగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, బ్యాంకి రుణాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే పశ్చిమ ప్రాంతానికి ఉపయోగపడేలా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో డిమాండ్స్‌తో కూడిన విన్నత పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు ఏర్వ పాపిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా బాల నాగయ్య, రేపని తిరుపతయ్య, నాయకులు ఓర్సు అడివయ్యా, బొమ్మన బోయిన ఏడుకొండలు, కేవీపీఎస్ నాయకులు జనామాల నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలతో మమేకమై రెవెన్యూ ఉద్యోగులు పని చేయాలి

### జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ ఆర్.వీ.ఎస్. కృష్ణమోహన్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 20)**
రెవెన్యూ దినోత్సవ సందర్భంగా ఒంగోలు రెవెన్యూ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ జెండాను జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏపీ జెఏసి అమరావతి చైర్మన్ ఆర్. వి.ఎస్. కృష్ణమోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థ సుమారు 268 సంవత్సరాల క్రితం ఏర్పడి ఇప్పటి వరకు రెవెన్యూ ఉద్యోగులు ఎంతో అంకితభావంతో పని చేస్తారన్నారు. మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికలలో సైతం ప్రకాశం జిల్లాలో ఎటువంటి రీపోల్ లేకుండా ప్రకాశం జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆధ్వర్యంలో చాలా ఉన్నతంగా పనిచేయడం జరిగిందని, ఇకపై కూడా ప్రజలతో మమేకమై రెవెన్యూ ఉద్యోగుల పని చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఉన్నత అధికారులు కూడా రెవెన్యూ ఉద్యోగుల శ్రమను గుర్తించి సరైన ప్రోత్సాహం కల్గించాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టరే పరిపాలన అధికారి డి. మల్లికార్జునరావు రావు, రెవెన్యూ అసోసియేషన్, జిల్లా కోశాధికారి జె.దానియేలు, కలెక్టరేట్ అధ్యక్షులు ఊతకోలు శ్రీనివాసరావు, కలెక్టరేట్ కార్యదర్శి, వెంకటేశ్వర రాజు, ఫణింద్ర, గాయత్రి, గౌతమి, ప్రియాంక, ఏపీజేఏసీ మహిళా విభాగం అధ్యక్షురాలు జయలక్ష్మి, ఒంగోలు ఆర్డీవో ఆఫీస్ డీఏవో సిహెచ్ కృష్ణారావు, ఏపీ తదితర రెవెన్యూ ఉద్యోగుల నాయకులు, ఆర్డీవో ఆఫీస్ కలెక్టర్ ఆఫీస్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## ఎన్డీఏ కూటమి అభ్యర్థి కందుల విజయంతో

# శ్రీశైలం పాదయాత్ర



**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జూన్ 20)**
కాషాయ జెండాతో ప్రారంభిం చిన మార్కాపురం యువ నాయకులు కందుల విగ్నేష్ రెడ్డి, కందుల రోహిత్ రెడ్డి తర్లుపాడు మండలం మీర్జెపేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు కూచిపూడి రోశప్ప నాయుడు, గుట్టపూశాల నరసింహ, పెసల కృష్ణ, సాయి, చేపట్టిన శ్రీశైలం యాత్రను మార్కాపురం యువ నాయకులు కందుల రోహిత్ రెడ్డి, కందుల విగ్నేష్ రెడ్డి, కాషాయ జెండా ఊపి ప్రారంభించారు. శ్రీశైలం మల్లిఖార్జున వద్దకు పాదయాత్ర చేసి మొక్కును తీర్చుకునేందుకు గురువారం సాయంత్రం పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రకు సంఘీభావం తెలిపేందుకు మండల అధ్యక్షుడు టీడీపీ ఎన్డీఏ కూటమి విజయం సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడు, మార్కాపురం ఎమ్మెల్యేగా కందుల నారాయణరెడ్డి విజయం చెందితే ఉడుముల చిన్నపరెడ్డి, వాణిజ్య విభాగం సభ్యులు పుచ్చనూతల గోపినాథ్ చౌదరి, మండల యూత్ అధ్యక్షుడు మేకల వెంకట్ యాదవ్, తర్లుపాడు గ్రామ అధ్యక్షుడు గౌతుకట్ల సుబ్బయ్య, తర్లుపాడు టీడీపీ కార్యదర్శి ఈర్ల కాశయ్య, మాజీ కోప్షన్ షేక్ అఫ్రోజ్, ఐటీడీపీ అధ్యక్షుడు శ్యామ్ సంగీభావం తెలిపారు అనంతరం భారీగా ర్యాలీ చేస్తూ తరలి వెళ్లారు.



# దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్







**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 20)**

కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి బంగారం ఆభరణాలు స్వాధీనం చేసుకోవడంపై ఒంగోలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో మీడియా సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పీ (క్రైమ్) యస్.వి. శ్రీధర్ రావు వివరాలు వెల్లడించారు. కొండపి మండలం, వెన్నూరు గ్రామానికి చెందిన పోకూరి వంశీకృష్ణ తన బంధువుల ఫంక్షన్ నిమిత్తం జూన్ 16వ తేదీన ఒంగోలు పట్టణంలోని ఎం.ఎస్ కళ్యాణ మండపం వద్దకు తన కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఈ క్రమంలో ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఫిర్యాదుదారుడి చిన్న కుమారుడైన జయవర్ధన్ బాబు (7) అక్కడ ఆడుకుంటూ ఉండగా రావిపాటి జగదీష్ అనే వ్యక్తి బాబుకు మాయమాటలు చెప్పి, బిల్డింగ్ పైకి తీసుకుని వెళ్లి బాబుని బెదిరించి, కొట్టి, మెడలోని బంగారు చైను- 2 సవర్లు, బ్రాస్లెట్-2 సవర్లు, ఉంగరము-6 గ్రాములు దొంగిలించుకుని పోయాడు. బాలుని వద్ద దొంగలించిన బంగారు ఆభరణాలను పుట్ట శ్రీనివాసులు అనే వ్యక్తికి ఉంచి అతని వద్ద డబ్బులు తీసుకున్నాడు.నేరస్తులు రావిపాటి జగదీష్, సాంబశివరావు కుమారుడు(27)శివరాంపురం గ్రామం, తాళ్ళూరు మండలం, ప్రకాశం జిల్లాగా గుర్తించారు. అదేవిధంగా పుట్ట శ్రీనివాసులు నాగేశ్వరరావు కుమారుడు(29) తూర్పు గంగవరం గ్రామం, తాళ్ళూరు మండలం, ప్రకాశం జిల్లాగా గుర్తించారు. సుమారు 16 గ్రాముల బంగారు గొలుసు, సుమారు 16 గ్రాముల బ్రాస్ లెట్, సుమారు 6 గ్రాముల బరువున్న బంగారు ఉంగరం స్వాధీనం చేసుకున్నారు. సొత్తు సుమారు 2 లక్షల రూపాయల విలువ ఉంటుందని పోలీసులు తెలిపారు.ఈ కేసును ఛేదించేందుకు ప్రకాశం జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (క్రైమ్) యస్.వి. శ్రీధర్ రావు సూచనల మేరకు ఒంగోలు డీఎస్పీ పర్యవేక్షణలో ఒంగోలు టు టౌన్ సిఐ , వారి సిబ్బందితో స్పెషల్ టీంలు ఏర్పాటు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి సాంకేతిక పరిజ్ఞానంతో 19వ తేదీన 16 గంటలకు ఒంగోలు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ముద్దాయిలు రావిపాటి జగదీష్‌ను , పి. శ్రీనివాసులను ప్రత్యేక బృందం అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా దొంగసొత్తును వారి వద్ద ఉంచుకున్న లేదా కొన్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కేసును చేధించటంలో ప్రతిభ కనపరచిన అడిషనల్ ఎస్పీ (క్రైమ్) యస్.వి. శ్రీధర్ రావు, ఒంగోలు డివిస్పీ కిషోర్ బాబు, ఒంగోలు టూ టౌన్ పిఎస్ సిఐ, వన్ టౌన్ పిఎస్ ఇంచార్జి ఎస్. జగదీష్, ఎస్సై కె.శివ ప్రసాద రావు, ఎఎస్సై కె.సురేష్, హెడ్ కానిస్టేబుళ్లు ఎం.సాయి, జి.విజయ్, కానిస్టేబుళ్లు ఎం.అనిల్, టి.తిరుపతయ్యలను ప్రకాశం జిల్లా ఎస్పీ అభినందించారు. జిల్లాలో ఎవరైనా గంజాయి, మాదక ద్రవ్యాలు క్రయ, విక్రయిస్తున్నా, సేవిస్తున్నట్లు సమాచారం ఉన్నా వెంటనే స్థానిక పోలీసులకు లేదా పోలీస్ వాట్స్ యాప్ నెంబర్ 9121102266, డయల్ 112, 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలని జిల్లా ప్రజలను కోరారు.

# అగ్ని ప్రమాద ఘటన పై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దిగ్భ్రాంతి

## బాధితుల్ని అన్ని విధాలా ఆదుకుంటాం

## రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 20)**

నెల్లూరు నగరంలోని రంగనాయకులపేట బర్మాషెల్ గుంటలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో 14 కుటుంబాలు నిరాశ్రయులు కావడం, ప్రమాదంలో ఓ దివ్యాంగురాలు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ప్రమాదంలో మృతి చెందిన దివ్యాంగురాలు కుటుంబాన్ని ఆదుకుంటామని, బాధిత కుటుంబాలకు తప్పకుండా అండగా నిలుస్తామన్నారు. బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని, ప్రభుత్వ పరంగా బాధితులకు ఇవ్వాల్సిన సహాయం వెంటనే అందజేయాలని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణతో చర్చించి అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఆ కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.








## బ్యూటీపార్లర్‌లో షార్ట్ సర్క్యూట్ తప్పిన ప్రమాదం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 20)**

ఒంగోలులోని విఐపి రోడ్డులో పద్మాలయ బేకరీ సమీపంలో ప్రొఫెషనల్ బ్యూటీ పార్లర్‌లో గురువారం ఉదయం మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక కార్యాలానికి ఫోన్ చేయడంతో వెంటనే వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పి అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని తెలిపారు.





## శ్రీ నాగులు మీరాస్వామి ఉరుసు మహోత్సవం



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 20)**

మార్కాపురం మండలం దరిమడుగు గ్రామంలో బుధవారం గంధం పూజ నిర్వహించుకొని గురువారం జెండాలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో తిరుణాళ్ల వాతావరణం ఏర్పడింది. ఉరుసు కార్యక్రమంలో భాగంగా ఎద్దుల బండ్ల పందేలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు ఎడ్ల ప్రదర్శనలో పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు జవ్వాజి రామానుజుల రెడ్డి, గ్రామ సర్పంచ్ బట్టగిరి గౌతమి గోపాల్ రెడ్డి, జవ్వాజి. మల్లికార్జున రెడ్డి, ముదిరెడ్డి అశోక్ రెడ్డి, చదలవాడ తిరుపతిరెడ్డి, పల్లెబోయన ఎర్రయ్య, బాపనపల్లి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు. మొదటి బహుమతి రూ. 5000లు, రెండో బహుమతి రూ.3000లు, మూడో బహుమతి రూ.2000లు అందజేశారు.

## ప్రభుత్వ కార్యాలయాల పరిశుభ్రతకు అధికారులు సహకరించాలి

### మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 20)**

కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు గురువారం కనిగిరి పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయ ప్రాంగణం మురుగునీరుతో అపరిశుభ్రంగా ఉందని పట్టణ ప్రజల ఫిర్యాదు మేరకు గురువారం మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అపరిశుభ్రమైన ప్రాంగణాన్ని సందర్శించి వెంటనే పారిశుధ్య అధికారులతో మాట్లాడి వెంటనే ఆ ప్రాంగణాన్ని శుభ్రం చేయించి ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్నంలోని ప్రభుత్వం కార్యాలయాలు అన్ని శుభ్రంగా ఉండేందుకు అధికారులు సహకరించాలని, అప్పుడే కార్యాలయాలు శుభ్రంగా ఉంటాయని ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత అటు అధికారులు, నాయకులకు ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, శానిటరీ కార్యదర్శి శాంతి, చౌడిశెట్టి శ్రీనివాసులు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దు చెక్‌పోస్టులు బలోపేతం

**గంజాయి అక్రమ రవాణా పై ఉక్కు పాదం**
**పబ్లిక్ న్యూసెన్స్ తగ్గించాలనే ముఖ్య ఉద్దేశంతో విజిబుల్ పోలీసింగ్ పెంచాం**
**నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలో జిల్లా ఎస్పీ ఆకస్మిక పర్యటన**
**పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా మాట్లాడాలి**
**విషయాన్ని తెలుసుకుని పోలీసులు అండగా నిలవాలి**
**జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు**

**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇన్‌చార్జి, జూన్ 20)**
జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు గురువారం నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలో ఆకస్మికంగా సుడిగాలి పర్యటన చేశారు. నాయుడుపేట సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయం, నాయుడుపేట సర్కిల్ కార్యాలయం, నాయుడుపేట, దొరవారి సత్రం, సూళ్లూరుపేట, తడ పోలీస్ స్టేషన్‌లను ఆకస్మికంగా సందర్శించి, అధికారులు సిబ్బందిని అప్రమత్తం చేశారు. విధులలో ఉన్న ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది, అధికారులతో మాట్లాడి వారి సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా శాఖ పరమైన సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేటలో మీడియా మిత్రులతో మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియను జిల్లా పోలీసు సిబ్బంది అధికారుల సమిష్టి కార్యాచరణతో ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేయడం చేయగలిగామన్నారు. సమస్యాత్మక గ్రామాలు,






ప్రాంతాల్లో పోలీస్ పికెట్లు, చెక్‌పోస్టులను మరికొన్ని రోజులు పాటు కొనసాగిస్తామన్నారు. విజిబుల్ పోలీసింగ్‌ను పెంచి పబ్లిక్ న్యూసెన్స్‌ను తగ్గించాలని ముఖ్య ఉద్దేశంతో ప్రస్తుతం ఒక ప్రణాళికాబద్ధంగా జిల్లా పోలీసు యంత్రాంగం పనిచేస్తున్నామన్నారు. సరిహద్దు చెక్‌పోస్టులను మరింత బలోపేతం చేసి, గంజాయి వంటి నిషేధిత వస్తువుల అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపి, పవిత్రమైన తిరుపతి జిల్లాలో మత్తు పదార్థాల అవశేషాలు లేకుండా చేస్తామన్నారు. తడ సరిహద్దు చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీలు చేసి, విధులలో ఉన్న సిబ్బందిని అప్రమత్తం చేశారు. చెక్ పోస్ట్ వద్ద ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించి, అవసరమైన సదుపాయాలను కల్పించాలని తడ ఎస్సైని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు వెంకటాద్రి ఎస్బి, శ్రీనివాసరెడ్డి నాయుడుపేట, నాయుడుపేట సబ్ డివిజన్ సిఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 22న జరిగే విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయండి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 20)**




ఒంగోలు నియోజకవర్గ శాసనసభ్యులుగా దామచర్ల జనార్ధన్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించిన ఒంగోలు నియోజకవర్గ ప్రజలకు టిడిపి నాయకులు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గం చరిత్రలోనే 34 వేలు అత్యధిక మెజార్టీతో గెలిచిన వ్యక్తి దామచర్ల జనార్ధన్ అన్నారు. అంత మెజార్టీ ఇచ్చిన ఒంగోలు నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. ఆ మెజార్టీతో ఇంకా అభివృద్ధి చేయడంలో కసిగా పని చేస్తామని తెలిపారు. ఒంగోలు నియోజకవర్గ శాసనసభ్యులుగా ఎన్నికయి శుక్రవారం 2వ సారి దామచర్ల ప్రమాణ స్వీకారం చేసి ఒంగోలు వస్తున్న సందర్భంగా 22వ తేది శనివారం సాయంత్రం స్వాగతం పలికి విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ర్యాలీ కర్నూల్ రోడ్డు ఫ్లైఓవర్ నుండి, బస్టాండ్, అద్దంకి బస్టాండ్, ట్రంక్ రోడ్ కలెక్టర్ ఆఫీస్ మీదగా మినీ స్టేడియం వరకు ర్యాలీ జరుగుతుందని టిడిపి నాయకులు తెలిపారు. ఈ విజయోత్సవ ర్యాలీలో టిడిపి, బిజెపి, జనసేన నాయకులు కార్యకర్తలు దామచర్ల అభిమానులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎద్దు శశికాంత్ భూషణ్, బండారు మదన్, దాయినేని ధర్మ, చందు, తదితరులు పాల్గొన్నారు.

# శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టాలి

**కరువు పరిశీలన బృందానికి**
**రైతు సంఘం, కౌలు రైతు సంఘం విజ్ఞప్తి**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 20)**



2023-24 సంవత్సరములో ప్రకాశం జిల్లాలో ఏర్పడిన కరువును పరిశీలించడానికి వచ్చిన కేంద్ర బృందానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతులు సంఘం ప్రకాశం జిల్లా కమిటీ ప్రతినిధులు జిల్లాలో కరువు పరిస్థితుల్ని వివరించారు. ఈ సందర్భంగా ఆ సంఘాల జిల్లా కార్యదర్శులు పమిడి వెంకట్రావు, వి.బాలకోటయ్య మాట్లాడుతూ గత ఖరీఫ్ , రబీ సీజన్లో పశ్చిమ ప్రాంతంలో 30 మండలాల్లో కరువు తీవ్రంగా ఏర్పడి పంటలు పూర్తిగా ఎండిపోయాయని,పశువులకు తాగటానికి నీరు కూడా లేదని చెప్పారు. అయినా ఖరీఫ్‌లో ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించలేదన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి కాకపోవటం వల్ల పశ్చిమ ప్రాంతంలో నిత్యం రైతులు పంటలు పండక దిగుబడి రాక ఇబ్బందులు పడుతున్నారు.2023 -24 సంవత్సరాల్లో నాగార్జునసాగర్, కొమ్మమూరు కాల్వ కింద నీరు రాకపోవటంతో సాగు చేయలేక పోయారు. రబీ సీజన్లో సెనగపైరు కూడా ఎండిపోయింది. గుండ్లకమ్మ ప్రాజెక్టు రిపేరు చేయకపోవడం వల్ల కారుమంచి కాల్వకు నీరు రాకపోవటం వల్ల పంటలు ఎండిపోయాయి అందువల్ల ఖరీఫ్, రబీ సీజన్లో నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘం డిమాండ్ చేస్తుంది. ఖరీఫ్, రబీ సీజన్లో ఎండిన పంటలన్నీ పంటలకు ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. రైతులు , కౌలు రైతుల పంట రుణాలు రద్దు చేయాలన్నారు. కౌలు రైతులను గుర్తించి నష్టపరిహారం వారికే ఇవ్వాలన్నారు. పశువులకు పశుగ్రాసం సరఫరా చేయాలన్నారు. వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి నీటిని నిల్వ చేయాలన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు పూర్తి చేసి కాలువ పూడికలు తీయాలన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకం ద్వారా సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలన్నారు. 600 రూపాయలు కూలి నిర్ణయించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు జై జయంతి బాబు, పి హనుమంత పాల్గొన్నారు.

# గోరంట్ల బుచ్చయ్య చౌదరిని కలిసిన మంత్రి గొట్టిపాటి

**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జూన్ 20)**
రాజ్ భవన్‌లో ఏపీ ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన గోరంట్ల బుచ్చయ్య చౌదరిని ఆంధ్రప్రదేశ్ విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సహచర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గుమ్మడి సంధ్యా రాణి, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ళ నరేంద్ర, బోండా ఉమా మహేశ్వరరావు, తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



# నూతనంగా బాధ్యతలు చేపట్టిన సూపరింటిండెంట్ సావిత్రి

**సత్కరించిన బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు**



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 20)**
మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు నూతనంగా సూపరింటిండెంట్‌గా గురువారం సావిత్రి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మార్కాపురం బిజెపి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు శాలువా, పూలమాలతో సత్కరించి పండ్లు అందించారు. జిల్లా వైద్యశాలలో ప్రజలకు కావాల్సిన సదుపాయాలు ఏవైనా ఉంటే మా దృష్టికి తీసుకు రావాలని పీవీ కృష్ణారావు కోరారు. అలాగే ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తూ వైద్యశాలకు మంచి పేరును తీసుకు రావాలని ఆకాంక్షించారు.

# బాబు జగ్జీవన్‌రావ్ విగ్రహ ఆవరణలో ఎమ్మార్పీఎస్ జెండా

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 20)**
కనిగిరి పట్టణంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రావ్ విగ్రహ ఆవరణలో ఎమ్మార్పీఎస్ జెండాను నిర్మించుకునేందుకు ఎమ్మార్పీఎస్ కనిగిరి నియోజకవర్గ ఇన్చార్జి రావినూతల కోటయ్య మాదిగ ఆధ్వర్యంలో గురువారం స్థలాన్ని పరిశీలించారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భవించి 30 ఏళ్లు కావస్తున్న సందర్భంగా గురువారం కనిగిరిలోని బాబు జగజ్జీవన్‌రావ్ విగ్రహం ఆవరణలో జెండాను నిర్మించుకొనుటకు సిద్ధపడ్డారు. అదే విధంగా వారు మాట్లాడుతూ జులై ఏడో తేదీన వరంగల్లో జరగబోయే మాదిగల ఆత్మగౌరవ కవాతుకు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో మహిళలు, యువకులు, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి అనుబంధ సంఘాల నాయకులు అందరూ భారీ సంఖ్యలో పాల్గొనాలని జులై ఆరో తేదీన బాబు జగజ్జీవన్‌రావు ఆవరణంలో నిర్మించుకోబడుతున్న ఎంఆర్పిఎస్ జెండాను ఎగరవేసి ఏడో తే వరంగల్‌లో జరగబోయే మాదిగల కవాతు విజయవంతం చేద్దామని ఆయన అన్నారు. కార్యక్రమంలో వెలిగండ్ల మండల అధ్యక్షుడు జేపీ రాజ్ మాదిగ , గూడూరు శేఖర్ మాదిగ, కుమ్మరి కుంట రాజు మాదిగ,పామూరు మండల అధ్యక్షులు రాచూరి ప్రకాశం మాదిగ, శేషం రోశయ్య మాదిగ పాల్గొన్నారు.



# స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేసిన గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 20)

గిద్దలూరు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మండల ఉన్నత విద్యాధికారులు గురువారం ఏర్పాటు చేసిన స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డికి విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది సాదర స్వాగతం పలికారు. తొలుత పాఠశాల ప్రాంగణంలోని శ్రీ సరస్వతీ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం విద్యార్థులకు బ్యాగ్, పాఠ్యపుస్తకాలు, కిట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారికి నాణ్యమైన విద్యా, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, మౌలిక సదుపాయాల కల్పన దిశగా తెలుగుదేశం ప్రభుత్వం ముందడుగు వేస్తుందని, ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని ఈ సందర్భంగా విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

# గునుపూడి భాస్కర్‌చే విజయోత్సవ కేక్ కటింగ్



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 20)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ ఘన విజయం సాధించినందుకు, మార్కాపురం నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి, పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాస్‌రెడ్డి ఘనవిజయం సాధించినందుకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ ఆయన సతీమణి మాధవిలచే వాసవి 11 ఫ్రెండ్స్ గురువారం పట్టణంలోని గునుపూడి భాస్కర్ నివాసంలో వారిచే విజయయోత్సవ కేక్ కటింగ్ చేయించి వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి చిరంజీవి, పైడిమర్రి కృష్ణ, వేమా కృష్ణ, గాదంశెట్టి శ్రీనివాసులు, సామి సుబ్రహ్మణ్యం, అంగులూరి సుబ్బారావు, కొత్త రమణమూర్తి, రావూరి సుబ్బారాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి కార్యాలయంలో మంత్రి కొల్లు రవీంద్ర జన్మదిన వేడుక



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 20)

ఒంగోలులోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఒంగోలు నియోజక వర్గ ఉపాధ్యక్షురాలు కొక్కిలిగడ్డ లక్ష్మీ ఆధ్వర్యంలో మంత్రి కొల్లు రవీంద్ర జన్మదినం పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బర్తడే కేక్‌ను కట్ చేశారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ చాపల వంశీకృష్ణ పాల్గొన్నారు. పార్టీ నాయకులు, మంత్రి కొల్లు రవీంద్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొక్కిలిగడ్డ లక్ష్మి మాట్లాడుతూ కొల్లు రవీంద్ర నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ, సంతోషాలతో ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొఠారి నాగేశ్వరరావు, ఆర్ల వెంకటరత్నం, పెళ్లూరు చిన్న వెంకటేశ్వర్లు, సముద్రాలు, చాపల మార్కెట్ వ్యాపారస్తులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# అగ్ని ప్రమాద బాధితులకు జిల్లా టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, నగర డిప్యూటీ మేయర్ పి రూప్ కుమార్ యాదవ్ పరామర్శ

## మంత్రి నారాయణ సొంత నిధుల నుంచి తక్షణ సాయం అందజేత

## ప్రమాదానికి గురైన ఇళ్లకు 15 వేలు చొప్పున,

## మృతి చెందిన నాగలక్ష్మి కుటుంబానికి 50 వేల రూపాయల ఆర్థిక సహాయం



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 20)

నెల్లూరు నగరంలోని బర్మాషాల్ గుంటలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో నాగలక్ష్మి మంటల్లో సజీవ దహనం అయ్యారు. విషయం తెలుసుకున్న నెల్లూరు పార్లమెంటు టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ సంఘటన స్థలానికి చేరుకొని జిల్లా కలెక్టర్ హరి నారాయణన్, ఆర్డీవోతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం తరపున అన్ని విధాల ఆదుకోవాలని గతంలోలా నామమాత్రపు నష్టపరిహారాలు కాకుండా పెంచి ఇవ్వాలని కలెక్టర్ హరినారాయణన్ కు సూచించారు. ప్రమాద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారని ఆర్టీవోకు సూచించారు. మంత్రి నారాయణ సొంత నిధుల నుండి ఒక్కో కుటుంబానికి తక్షణ సహాయం కింద 15 వేల రూపాయలు, మృతి చెందిన నాగలక్ష్మి కుటుంబానికి 50వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. అగ్ని ప్రమాదంలో పేదవారు సర్వస్వం కోల్పోవడం, నాగలక్ష్మి సజీవ దహనం కావడం దురదృష్టకరం, బాధాకరం. అధికారులు ఎంత నష్టం జరిగిందో అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం తరపున ఇచ్చే ఎక్స్‌గ్రేషియా కాకుండా మంత్రి నారాయణ తన సొంత నిధుల నుండి ఇంటికి 15 వేలు చొప్పున మరణించిన నాగలక్ష్మికి 50 వేలు ఆర్థిక సహాయం చేస్తున్నారు. గతంలో లాగా 5 వేలు కాకుండా పెంచి ఇవ్వమని కలెక్టర్ కు చెప్పాను. అధికారులు పెంచి ఇవ్వటానికి కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, స్థానిక కార్పొరేటర్ అస్మామైనుద్దీన్, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, మామిడాల మధు, ఇక్బాల్, కువ్వారపు బాలాజీ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఓవైపు ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ

## మరో వైపు మైనింగ్ నడిపినోళ్లకు షోకాజ్ నోటిస్‌తో సరి

## ఇదీ జిల్లా ఐసిడిఎస్ పిడి నిర్వాకం

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 20)

నెల్లూరు జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ తీరు చూస్తుంటే అయినవారికి ఆకుల్లో.. కాని వారికి కంచాల్లో అన్న తీరుగా ఉందని జిల్లా వ్యాప్తంగా చర్చించుకుంటున్నారు. ఇందు గల కారణాలు లేకపోలేదు.. చేజర్ల మండలం కొలప నాయుడు పల్లి గ్రామంలో సాక్షాత్తు ఇంచార్జి సూపర్వైజర్ ఆదురుపల్లి సెక్టార్ పరిధిలో వై సుబ్బరత్నమ్మ విధులు నిర్వహిస్తుంది. 27- 9-2023వ తేదీన శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి మినరల్స్ పేరున జిల్లా మైనింగ్ అధికారులు మైనింగ్ స్టాక్ పాయింట్ ను నిబంధనలు ఉల్లంఘించి కేటాయించారు. ఈ విషయాన్ని గత రెండు రోజుల క్రితం అన్ని పత్రికలు ఘోషించాయి. దీంతో తేరుకున్న ఐసీడీఎస్ పీడీ కంటి తుడుపు చర్యగా.. తూతూ మంత్రంగా సదరు ఇన్చార్జి సూపర్వైజర్ కు గురువారం షోకాజ్ నోటీసు ఇచ్చి చేతులు దులుపుకోవడం విశేషం. గత 15 సంవత్సరాల నుండి ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ.. ప్రభుత్వ జీతం పొందుతూ.. మైనింగ్ స్టాక్ పాయింట్ ను అక్రమంగా పొందిన ఇన్చార్జి ఐసిడిఎస్ సూపర్వైజర్ కు ఐసిడిఎస్ పిడి షోకాజ్ ఇచ్చి సరి పెట్టడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇటీవల జిల్లా విజిలెన్స్ మైనింగ్ అధికారులు స్టాక్ పాయింట్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి సుమారు 1500 టన్నులు తెల్లరాయి నిల్వ ఉన్నట్లు జిల్లా అధికారులకు నివేదిక పంపించిన విషయం విదితమే. ఇందుకు సంబంధించి జిల్లా మైనింగ్ అధికారులు విచారణ చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ అక్రమంగా తెల్ల రాయి స్టాక్ పాయింట్ ను పొందడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు ఇలాంటి అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.



Department Of Mines & Geology
GOVERNMENT OF ANDHRA PRADESH
FORM-B
[ See Rule 4 (b) ]
FORM OF LICENSE

మైనింగ్ శాఖ అధికారులు సుబ్బరత్నమ్మకు అనుమతినిచ్చిన ఉత్తర్వులు.

License No. : MDL0109011005 | Date : 27/09/2023

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | Application ID No. | : | FORMA092001300002 | | | |
| 2 | Name of the Licensee ( in full) | : | SRI PENUSILA LAKSHMI NARASIMHA SWAMY MINERALS | | | |
| 3 | Profession | : | TRADING BUSINESS | | | |
| 4 | Full Address | : | Door No. | 000 | Street | 000 |
| | | | Village | Nernoor | Mandal | Chejerla |

# ఏ ఒక్క రైతూ సాగునీటి సమస్య ఎదుర్కోకూడదు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 20)

కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఏ ఒక్క రైతు కూడా సాగునీటి సమస్య ఎదుర్కోకూడదని కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిగారు అన్నారు. నెల్లూరులోని విపిఆర్ నివాసంలో కోవూరు నియోజవర్గంలోని అన్ని మండలాల ఇరిగేషన్ అధికారులతో ఆమె గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ నీటి కాలువల్లో కలుపు మొక్కలు తొలగించి నీటి పారుదలకు అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా జిల్లాలో వచ్చే వానలను దృష్టిలో పెట్టుకుని చెరువులను శుభ్రం చేయించాలని, ఎక్కడా నిర్లక్ష్యం వద్దని ఆదేశించారు. నియోజకవర్గవ్యాప్తంగా కేవలం 50 మంది మాత్రమే లష్కర్‌లు ఉన్నారని, వారి సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సాగునీటి పరంగా ఏదైనా సమస్యలుంటే తప్పకుండా తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత రైనీ సీజన్లో భారీ వర్షాలు లేదా తుఫానులు లాంటి విపత్తులొస్తే ముందస్తుగా నియోజకవర్గ పరిధిలోని ఏ ఏ చెరువులు మరియు కాలువలకు తక్షణ మరమ్మతులు చేయాల్సి ఉంటుందన్నదానిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలో పంట పొలాలకు సాగునీరందించే విషయంలో ఎక్కడా అశ్రద్ధ వద్దని సూచించారు.

# మంత్రి ఆనంకు పలువురు శుభాకాంక్షలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 20)

విజయవాడ సమీపంలోని గొల్లపూడి దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో గురువారం రాష్ట్ర దేవాదయ ధర్మదాయ శాఖ మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గురువారం ఉదయం వేద పండితుల ఆశీర్వచనాలతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించగా మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి దస్త్రాల పై సంతకాలు చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. తొలుత వేణుగోపాలస్వామి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆనం రామనారాయణరెడ్డికి దేవాదాయ శాఖ ముఖ్య అధికారులు, పలువురు ప్రముఖులు, నెల్లూరు జిల్లాకు చెందిన ముఖ్య నేతలు ఘన స్వాగతం పలికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com